11/7

Entered

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

జులై 2, 2006

మనసున మల్లెలు కురిపించే చిత్రగీతాలు

హ్యాపీ బర్త్ డే

(2.7.2006 నుండి8.7.2006 వరకు)

జి. అభినయ్
2సం॥, జులై-2
సంధ్య-ముకుందరెడ్డి
కరీంనగర్

బి. యశ్వంత్‌బాబు
5సం॥, జులై-3
అన్నపూర్ణ-శ్రీనివాసరావు
మంగళగిరి-గుంటూరు

వి. సాహిత్
4సం॥, జులై-4
రాజేశ్వరి-ప్రసాద్
కొడిమ్యాల-కరీంనగర్

వి. రోహిత్
4సం॥, జులై-4
రాజేశ్వరి-ప్రసాద్
కొడిమ్యాల-కరీంనగర్

ఎ. సూర్యసోనిక
7సం॥, జులై-4
రమాదేవి-శ్రీనివాస్
కాజ-గుంటూరు

డి. సాత్విక
2సం॥, జులై-6
కల్పన-శ్రీనివాసరావు
వైరా-ఖమ్మం

పి. నిక్షిప్త(బన్ని)
2సం॥, జులై-8
అనిత-రమేష్
ఆదిలాబాద్

ఎ.లక్ష్మీగౌరి
సురేష్‌కుమార్-శివపార్వతి
గుంటూరు

వి. అక్షర
2సం॥, జులై-8
లతారాణి-శ్రీధర్
హైదరాబాద్

ఆర్. సౌదామిని
భాగ్యలక్ష్మి-రాజా
గోళ్లపాడు-ఖమ్మం

టి. రక్షిత్
4సం॥, జులై-7
కుమారి-అనంతరామయ్య
బురహాన్‌పురం-ఖమ్మం

శ్రీజ
సంధ్య-శ్రీనివాస్
రత్నపూర్-మెదక్

ఆదర్శ వర్శిటీగా రూపొందించాలని...

ఎస్‌వి యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ బాధ్యతలు చేపట్టి, నూతన విద్యావిధానం ప్రవేశపెట్టి, ఆదర్శ వర్శిటీగా రూపొందించాలని ప్రొఫెసర్ వృత్తిలో చేరిన రోజుల్లో అనుకున్నాను. నిరంతరం పరిశోధనలు చేస్తూ, మెరుగైన చదువును అందించాలని ప్రతినిత్యం కృషి చేస్తున్నాను. విభాగపు అధిపతిగా, డీన్‌గా, ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తును. ఫలితంగా వైస్‌ఛాన్సలర్ బాధ్యతలు అప్పగించారు. నూతన విద్యావిధానాలతో పాటు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాను. పరిశోధనలకు పెద్దపీట వేశాం. ఎస్.వి.యూనివర్సిటీని గ్లోబల్ సెంటర్ ఎక్స్‌లెన్స్‌గా రూపొందించాలని కృషి చేస్తున్నాను. 18 నెలల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. రాష్ట్రంలోనే ఎస్‌వియూ అంటే పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదలలో మంచి గుర్తింపు సాధించాం. ఇవాళ విద్యారంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. సవాళ్లను ఎదుర్కోడానికి సమాజం, పరిశ్రమలకు అవసరమైన కోర్సులను రూపొందించడం చేయాలి. విద్యార్థుల ఆలోచనలు మారాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో ఎలాంటి కోర్సు చదివినా ఉపాధి దొరుకుతుందనే అభిప్రాయం ఉంది. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలను ప్రోత్సహించే కొత్త కోర్సులు వస్తున్నాయి. దీనికి తగ్గట్లుగా నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరచుకుంటే బాగుంటుంది. వర్శిటీలలో కళాశాలలుగా విభజించడంవల్ల మెరుగైన సేవలను అందించవచ్చు. ప్రిన్సిపాల్స్‌కు హక్కులు కల్పించడం వలన విద్యార్థుల సమస్యలు తేలిగ్గా పరిష్కారమౌతాయి. పరిశోధనారంగంలో శాస్త్రవేత్తల కొరత వుంది. బేసిక్‌అంశాలో పరిశోధనలు జరిగితే టెక్నాలజీ అభివృద్ధిచెందుతుంది. ఎస్‌వియూను ఆదర్శంగా రూపొందించి, విద్యార్థులు ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే నా ధ్యేయం. వీటి సాధనకు కృషి చేస్తాను. సాధిస్తాను.

మన అతిథి గురించి...

పేరు :	డాక్టర్ ఎస్.జయరామరెడ్డి
పుట్టిన తేదీ :	1-7-1945
విద్య :	ఎంఎస్సీ, పిహెచ్‌డి
వృత్తి :	ఎస్‌వి యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్
పర్యటనలు :	పరిశోధనల నిమిత్తం ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నేషనల్ సెమినార్‌లకు.

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్ పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
మనమూ మన నమ్మకాలు 20 ...

ఇంకా...

ఇలా వుందామా... 7
ప్రశ్నార్థకం

సీరియల్ 8
తెలుగుగడ్డ

ఆరోగ్యం ... 17
సమీక్షణం ... 21
మనసా... తెలుసా ... 22
అవీ... ఇవీ ... 23
కొత్త పుస్తకాలు ... 24

కథ 18
ఎందుకు చెయ్యకూడదు?



అట్టమీది కథ

18వ తేదీ నాటి స్నేహ సంచికలో అట్టమీదికథ 'అడ్రస్ లేని ఉత్తరాలు...'లో ఉత్తరాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఆలోచింపజేసేలా సాగింది. లేఖ కథాకమామిషు వల్ల ఎన్నో విషయాలు తెలిశాయి. 'టర్నింగ్ పాయింట్' ద్వారా మైసూర్ టైగర్ టిప్పుసుల్తాన్ గురించి గ్రహించాం. 'అవీ...ఇవీ' శీర్షిక బాగుంటోంది. పుస్తక సమీక్ష వల్ల కొత్త పుస్తక పరిచయభాగ్యం కలుగుతోంది. 'ఇలా ఉందామా?' లో అసలు ప్రజ్ఞ అంటే ఏంటో చాలా చక్కగా తెలియజేశారు. 'సినిమా కబుర్లు'లో రాళ్లపల్లి మాతో ప్రత్యక్షంగా సంభాషిస్తున్నారా అన్నంత ఆనందం కలుగుతోంది. అభినందనలు.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

ఆసక్తికరంగా

టర్నింగ్‌పాయింట్‌లో 'మైసూర్ టైగర్ టిప్పుసుల్తాన్' చాలా ఆసక్తికరంగా సాగింది. చివరివరకూ ఉత్కంఠభరితంగా చదివించింది. ఒకవేళ నాల్గవ మైసూరు యుద్ధంలో టిప్పు గెలిచి ఉంటే...? దేశ చరిత్ర పూర్తిగా వేరే మార్గంలో నడిచేదా? 1800కల్లా ఆంగ్లేయుల దాస్యంనుండి దేశం విముక్తి పొందేదా? అంటూ రసవత్తరంగా ముగించారు. ప్రతివారమూ ఇలా విశిష్టమైన వ్యక్తుల గురించి సమాచారాన్ని అందిస్తున్నందుకు కృతజ్ఞతలు.

లత, తిరుపతి.

త్యాగం

స్నేహ సంచికలోని కథ 'త్యాగం' కంటతడి పెట్టించింది. నిజంగానే తల్లి తప్ప వేరెవరూ చేయలేని త్యాగమది. కరువు రక్కసి రైతులనెలా కబళిస్తోందో తెలుసుకోవడానికి ఈ కథ సజీవ సాక్ష్యం. 'బాలనేస్తాలు' చాలా ఆకర్షిస్తోంది. ఉత్తరాలపై కథనం ఇచ్చి పిల్లల్లో ఉత్తరాలు రాసే అభిరుచిని తట్టి లేపే ప్రయత్నం చేసినందుకు కృతజ్ఞతలు.

పూర్ణిమ, కాణిపాకం, చిత్తూరు

వాస్తు...

'మనమూ మన నమ్మకాలు' శీర్షికలో వాస్తు వాస్తవమేనా? సహజంగా వుంది. తమ ఇంటి వాస్తు బాగాలేదంటూ చాలామంది ఇళ్లను కూలగొట్టి కట్టిస్తుంటారు. ఆ తరహావారికిది కనువిప్పు లాంటిది. ఇలాంటి నమ్మకాలున్నవారు వారి కుటుంబీకులు వ్యాధిగ్రస్తులు కావడానికి వాస్తుదోషమే కారణమంటారు. ఇదో ఫోబియా లాంటిది. ఇలా ఆలోచించేవారిలో చాలామంది విద్యావంతులు ఉండడం గమనార్హం.

కేశవ్, కడప

పంట

'విజ్ఞాన వీచిక' శీర్షికలో అవయవాల 'పంట' చాలా ఆసక్తికరంగా సాగింది. నిజంగా ఇలాంటి అవకాశముందని తేలడమే గొప్ప విషయం. విజ్ఞానవీచిక శీర్షికలో అందిస్తున్న వ్యాసాలన్నీ బాగుంటున్నాయి.

హేమ, కావలి.

అభిరుచి

'రుచి'లో మీరందిస్తున్న వంటలన్నీ బాగుంటున్నాయి. 'కలంస్నేహం' ద్వారా ఉత్తరాలు రాసే అభిరుచిని ప్రోత్సహిస్తున్నారు. 'కవర్ పేజీ' చాలా బాగుంది. 'హాపీ బర్త్‌డే' శీర్షిక ద్వారా ఉచితంగా పిల్లలకు పుట్టినరోజు శుభాకాంక్షలందిస్తున్నందుకు కృతజ్ఞతలు.

శిల్ప, హైదరాబాద్

మరిన్ని...

ప్రతివారమూ స్నేహలో ప్రచురిస్తున్న కార్టూన్లు, జోక్సు మమ్మల్ని నవ్విస్తున్నాయి. నేను పుస్తకం తెరవగానే మొదట చూసేది కార్టూన్లు లేదా జోక్సే. ఇంకా ఎక్కువ కార్టూన్లు ప్రచురించాలని కోరుతున్నాను.

రాఘవ్, హైదరాబాద్

మానసిక సమస్యలకు...

'మనసా తెలుసా' శీర్షికలో మానసికమైన వత్తిళ్లకు సంబంధించిన సలహాలిస్తున్నారు. చాలా బాగుంది. దీనివల్ల టీనేజ్ పిల్లలు చాలావరకూ తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశముంది. న్యాయసలహాలు శీర్షికన ఇస్తున్న సలహాలు చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి.

సంధ్య, మంచిర్యాల, అదిలాబాద్

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ.150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

3730

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

సోవియట్ రష్యా విప్లవ సారధి లెనిన్

ఆదిమ సమాజంలో నెలకొన్న మానవులమధ్య సమానత్వ భావం క్రమేపీ అదృశ్యమైంది. సొంత ఆస్తి, స్వార్థం, ధూర్జనధ్యేయంగా సాగిన క్రమంలో పేదలు, ధనికులు అనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి. సంపదను ఉత్పత్తి చేసే వనరులను, సాధనాలను సొంతం చేసుకుని, ధనికవర్గం, పేదలను నిరుపేదలుగా మార్చింది. సమాజంలో అధికులుగా ఉన్న పేదల శ్రమను దోచుకోవడం ద్వారా తమ ఆస్తులను, అధికారాన్ని ధనిక వర్గాలు గణనీయంగా పెంచుకున్నాయి. ధనిక వర్గ ప్రయోజనాలకు మతం, కులం, రాజ్యం ఇతోధికంగా సాయ పడ్డాయి. రెండు ప్రధాన వర్గాలుగా ఏర్పడ్డ సమాజంలో, అణచి వేయబడ్డ ప్రజలు నిస్సహాయులుగా, నిరాశాపరులుగా, నిష్క్రియావరులుగా ఉండిపోలేదు. బానిస సమాజంలో యజమానులకు వ్యతిరేకంగా ఎన్నో తిరుగుబాట్లు జరిగాయి. దీనికి ప్రబల ఉదాహరణ స్పార్టకస్ చారిత్రాత్మక తిరుగుబాటు. బానిస సమాజం దాటి భూస్వామ్యదశలో అనేకానేక రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి. అదే క్రమంలో పెట్టుబడిదారీ సమాజంలో, పాశ్చాత్య దేశాల్లో, ఇటు వలస పాలిత ప్రాంతాల్లో కార్మిక వర్గం, పెట్టుబడిదారీ వర్గాన్ని ఎదిరిస్తూ పోరాటాలు సాగించింది.



పై నేపథ్యంలో, జారు చక్రవర్తులు పరిపాలిస్తున్న రష్యాదేశంలో 1870లో, పాఠశాలలపై అజమాయిషీ చేసే ఒక అధికారి కుటుంబంలో, వ్లాదిమిర్ ఇలిచ్ లెనిన్ పుట్టాడు. పుట్టినప్పుడు తెలీదు, లెనిన్ ప్రపంచంలో మొదటి కష్ట జీవులరాజ్యాన్ని స్థాపిస్తాడని. ఒక మనిషిని మరొక మనిషి కొన్ని యుగాలుగా దోచుకుంటున్న సమాజాన్ని నిర్మూలించి సమసమాజాన్ని స్థాపిస్తాడని. జారు చక్రవర్తులు పరమనిరంకుశులు. వారి పాలనలో ప్రజల కడగండ్లకు మతం లేదు. ఒకవైపు దారిద్ర్యం, మరోవైపు పీడనతో ప్రజలు మగ్గిపోతున్న సమయం.



ఐరోపా ఖండనాగరికతకు పుట్టిన చివరి శిశువుగా రష్యాను చరిత్రకారులు అభివర్ణించారు. లెనిన్ పుట్టే నాటికే రష్యాలో చైతన్యం మొదలైంది. లెనిన్ అన్న అలెగ్జాండర్ విప్లవ రహస్య కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. లెనిన్‌కు సోదరుడు అలెగ్జాండర్ మార్గదర్శకుడు, గురుతుల్యుడు. అలెగ్జాండర్ కార్యదీక్ష, నైతిక నిబద్ధత తిరుగులేనిది. అందుకే లెనిన్ అన్నను అనుసరించాడు. లెనిన్‌కు మార్క్సిజాన్ని గూర్చి మొదటిసారిగా తెలియజెప్పిందీ అన్నే! అన్న ఆశయం జారుచక్రవర్తుల నిరంకుశ అధికారాన్ని కూలదోసి, విప్లవ ప్రభుత్వాన్ని ఏర్పర్చడం. ఇదిలా ఉండగా 1886లో తండ్రి మరణంతో కుంగిపోయిన లెనిన్‌కు, జారు ప్రభుత్వం అన్న అలెగ్జాండర్‌ను నిర్బంధించి, 1887లో ఉరి తీయడంతో, జీవితంలో ఇక తట్టుకోలేని దిగ్భ్రాంతికి, తీరని దు:ఖానికి గురయ్యాడు. ఇదే లెనిన్ జీవితంలో గొప్ప మలుపు. ఇక తన అన్న ఆశయసిద్ధికి అంకితం కావాలని నిర్ణయించుకున్నాడు.

లెనిన్ న్యాయశాస్త్ర వృత్తి చాలించాడు. పూర్తి కాలాన్ని మార్క్సిస్టు సిద్ధాంత అధ్యయనానికి, అవగాహనకు వినియోగించాడు. ఆయనలో అప్పటికే రగులుతున్న విప్లవజ్వాల మరింతగా ప్రజ్వరిల్లసాగింది. అయితే అన్న అనుసరించిన టెర్రరిస్టు మార్గంద్వారా విప్లవం సాధ్యం కాదని ఆ మార్గాన్ని విడనాడి ప్రజల్ని సమీకరించి పోరాటాలు నిర్వహించడంద్వారానే జారు ప్రభుత్వాన్ని మట్టికరిపించాలనుకుని, ఆ మార్గంలో నడిచాడు. ఆ క్రమంలో జారు ప్రభుత్వం లెనిన్‌ను రెండుసార్లు దేశ బహిష్కృతుణ్ణి చేసి సైబీరియాకు పంపింది. అయినా ఆయన దీక్ష సడలలేదు. 1903లో రష్యా సోషలిస్టు డెమోక్రాటిక్ పార్టీలో చీలిక తెచ్చాడు. బోల్షివిక్కులకు బలం చేకూర్చి, నాయకత్వం వహించడంద్వారా భవిష్యత్తులో బోల్షివిక్కుల నాయకత్వంలో సోషలిస్టు విప్లవం సాధించడానిగ్గానూ పునాదులు వేశాడు.

1914లో మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. ఈ యుద్ధాన్ని రెండు సామ్రాజ్యవాద శిబిరాలమధ్య ఆధిపత్యం కోసం జరిగే ఘటనగా పేర్కొని సంచలనం సృష్టించాడు. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధాన అంతిమదశగా పేర్కొని ప్రపంచాన్ని కబళించచూస్తున్న సామ్రాజ్యవాదుల పన్నాగాల్ని ఎత్తిచూపాడు. ప్రపంచవ్యాప్తంగా బడుగుదేశాలను, ఆ దేశాల్లోని పీడిత, తాడితుల్ని అమానవీయంగా దోచుకుంటున్న పెట్టుబడిదారీ విధానాన్ని అంతమొందించాలంటే, సామ్రాజ్యవాదాన్ని మట్టుపెట్టాలని ప్రపంచ కార్మిక వర్గానికి ప్రత్యేకించి రష్యన్లకు పిలుపునిచ్చాడు.

మొదటి ప్రపంచ యుద్ధం ఇంకా ముగియక ముందే (1918లో ముగిసింది) రష్యాలో యుద్ధం ఆరంభమైంది. ఆ సమయంలో అదనుచూసి విప్లవం తీసుకొచ్చారు. మెన్షివిక్కుల నాయకత్వంలో ఏర్పడ్డ ప్రభుత్వాన్ని కూలదోసి, 1917 నవంబర్ 7న లెనిన్ బోల్షివిక్కుల నాయకుడుగా, సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌ను స్థాపించి, కారల్‌మార్క్స్, ఎంగెల్స్‌ల కలల్ని సాకారం చేశాడు. సామ్రాజ్యవాదుల యుద్ధంనుండి రష్యాను తప్పించాడు. 'దున్నేవాడికే భూమి' నినాదంతో భూపంపకం చేపట్టాడు. రాజకీయ అధికారాన్ని ప్రజలకు అప్పచెప్పాడు. మార్క్సిజాన్ని అభివృద్ధిచేసి, విప్లవాన్ని సాధించడంద్వారా లెనినిజానికి కారకుడయ్యాడు. విప్లవసిద్ధికి బలమైన, క్రమశిక్షణాయుతమైన కమ్యూనిస్టుపార్టీ నిర్మించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాడు. ప్రపంచదేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమవ్యాప్తికి తోడ్పడ్డాడు. *

అది ఎంతవరకూ సబబు?

అయ్యా, నేను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎం.పి.టి.సి. పోస్టుకు అభ్యర్థిగా నామినేషన్ వేశాను. నామినేషన్ పత్రాల్లో ఒక సెట్టును నిరాకరించినట్లయితే ఇంకో సెట్టు వుంటుందని రెండు సెట్ల నామినేషన్ వేశాను. రెండు సెట్లకు విడివిడిగా తగినంత రుసుము చెల్లించి రసీదు తీసుకున్నాను. రెండు సెట్లను పరిశీలించిన అధికారులు రెండూ బాగానే వున్నాయన్నారు. దాంతో రెండోసారి వేసిన నామినేషన్ను ఉపసంహరించుకున్నాను. మొదట నా పేరు పోటీ చేసిన అభ్యర్థుల లిస్టులో చూపించారు. మరుసటిరోజు నా పేరు తీసేశారు. ఇదేంటని అడిగితే ఒకటి ఉపసంహరించుకున్నట్లయితే రెండోది కూడా ఉపసంహరించుకున్నట్లే అన్నారు. అది ఎంతవరకూ సబబు? ఇప్పుడు నేనేం చేయాలి?

పి. సురేంద్ర, విజయవాడ.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

సాధారణంగా ప్రతి అభ్యర్థీ స్క్రూటినీలో జరిగే తప్పులవల్ల ఒకే సెట్టు వేసినట్లయితే ఒక్కోసారి రిజెక్టయ్యే అవకాశం వుండొచ్చని రెండుగానీ ఇంకా ఎక్కువగానీ వేస్తుంటారు. అలా ఐదు సెట్ల నామినేషన్ పత్రాలు వేసినప్పటికీ ఒక సెట్టుగానే పరిగణించబడ్తుంది. అలాగే ఒక సెట్టు రిజెక్టయితే తక్కినవి కూడా రిజెక్టు అవుతాయి. ఏదేమైనా మరోసారి ఆర్.డి.ఓ. అధికారికి విషయం వివరించి చూడండి.





అంతే...

రవి : ఒరేయ్ రాజూ, మనం రోజూ ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడం ఏమీ బాగాలేదురా. నేను ఫోన్ చేస్తే నువ్వు మాట్లాడడం లేదా నువ్వు ఫోన్ చేస్తే నేను మాట్లాడడం రొటీన్ అయిపోయింది. బోర్‌గా ఉంది.

రాజు: మరేం చేద్దాంరా...

రవి: ఆలోచించరా...

కొద్ది సేపటి తర్వాత...

రాజు: ఐడియా! ఇంతకు పూర్వం రాజులు పావురాల ద్వారా ఉత్తరాలు పంపుకునే వారట గుర్తుందా? అలాగే మనమూ రెండు పావురాలు కొనుక్కుని వాటికి ట్రయినింగిచ్చి ఉత్తరాలు పంపుకుందామా?

రవి: నిజంగా ఇదేదో బాగానే ఉందిరా.

అనుకున్న ప్రకారం ఆ ఇద్దరు స్నేహితులూ పావురాల ద్వారా ఉత్తరాలు పంపుకున్నారు. ఇలా కొద్ది రోజులు గడిచాయి.

ఓ రోజు...

రాజు: ఏంట్రా రవీ, చెప్పాపెట్టకుండా ఇలా ఊడిపడ్డావ్. ఏంటి సంగతులు? ఆ... అన్నట్టు అడగడం మర్చిపోయాను నువ్వేంటి నిన్న ఖాళీ పావురాన్ని పంపించావ్. దాని కాళ్లకు ఉత్తరం లాంటిదేదీ కనిపించలేదు.

రవి: ఓ అదా... మనం ఫోన్‌లో ఒక్కోసారి మిస్డ్‌కాల్స్ ఇచ్చుకోమా, అలాగే నేను ఖాళీ పావురాన్ని పంపానంతే...

-హిమ

ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

పదవి-పాట్లు

రావుగారికి ఉదయం నుంచీ ఏదో తెలియని అలజడిగా ఉంది. కారణం మరేంలేదు. ఆరోజు సాయంత్రం అపార్టుమెంటు సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలు. రెండు సంవత్సరాలుగా ఒకే ప్రెసిడెంట్, సెక్రట్రీ, వైస్ ప్రెసిడెంట్ వగైరాలు నడిపేస్తున్నారు. మళ్లీ కమిటీ మీటింగ్ పెట్టుకుని, ఎన్నికలు జరుపుకుని కొత్తవారు పదవుల్లోకి వచ్చి, ఎన్నో సంస్కరణలు చెయ్యాలని కొందరు ఉవ్విళ్లూరుతూ ఉన్నారు. అందులో రావుగారు ముఖ్యులు.

ఉద్యోగస్తులు, కుర్రవాళ్లు ఈ బరువు బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధంగా లేరు. రెండేళ్లుగా రిటైరయి కాలక్షేపంకోసం తహతహలాడుతున్న ఒకరిద్దరి మధ్య చిన్నసైజు పోటీ నడిచినా, అన్నివిధాలా రావుగారు అర్హులని తేల్చి, అందరూ చేతులెత్తి ఆయన్ని ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఇంతకు పూర్వం పనిచేస్తున్న కమిటీని ఘాటుగా, అదీ వెనుకగా రావు విమర్శించిన సందర్భాలు తెలిసినవాళ్లు- ఈయనొస్తే బాగుంటుందని ముందుకుతోశారు.

సాయంత్రం ఏడున్నర గంటలకి స్నాక్స్, కూల్‌డ్రింకులు తీసుకుని కమిటీ మీటింగ్ ముగించుకుని అందరూ ఎవరిగూటికి వారు చేరారు.

రావుగారు కూడా ఇంట్లో ఆనందంగా అడుగు పెట్టేసరికే "ఇంతకు పూర్వమే వాచ్‌మన్ వచ్చి చెప్పాడు మీరు కొత్త ప్రెసిడెంటని" అంటూ ఎదురొచ్చిన భార్యని చూసి పొంగిపోయాడు.

'అపార్టుమెంట్లో ఉన్న లొసుగులన్నీ ఈ దెబ్బతో తీరిపోవాలి' అంటూ కొత్త ప్రెసిడెంట్‌గారి భుజం తట్టింది భార్య శాంత. ఆ క్షణంలో రావుగారికి యు.ఎస్. ప్రెసిడెంటయినంత ఆనందం, గర్వం కలిగాయి.

ఆనందంతో నిద్రపట్టదేమోననిపించిందాయనకి. శాంత రాత్రికి తినే టిఫిన్ సంగతి పక్కనపెట్టి వెంటనే పాయసం చేసి సెలబ్రేట్ చేసింది. అప్పటికే రెండుసార్లు వచ్చి సలాంకొట్టి వెళ్లిన వాచ్‌మన్‌ని చూస్తే ఎంతవద్దనుకున్నా గర్వంగానే ఉంది. నిన్నటిదాకా వీడు తను మెట్లు దిగుతుంటే కనీసం కుర్చీలోంచి లేచికూడా ఎరుగడు. అలాంటిదిప్పుడు కనిపించినప్పుడల్లా 'నమస్తేసార్!' అనడమే కాకుండా, 'అదిలాగ... ఇదలాగ...' అంటూ విన్నవించుకుంటుంటే ఆశ్చర్యంకాక మరేమిటి అనిపించింది.

వేసవికాలంలో పంపులు తిప్పేందుకు టైములు నిర్ణయించడంవల్ల వాచ్‌మన్‌లకు రెప్పవేసే విశ్రాంతి కూడా ఉండటం లేదు.

తెల్లారి ఆరుగంటలకి కాలింగ్ బెల్ ఒకటికి మూడుసార్లు మోగేసరికి ఎవరు చెప్మా అంటూ నిద్ర కళ్లతో తడబడుతూ వెళ్లింది శాంత. ఎదురుగా మూడొందలరెండు. "నీళ్లేమిటీ ఇంకా రావడంలేదు?" అంది అవతలి కంఠం.

కొంతసేపటివరకూ ఆమెకసలు విషయం అర్థంకాలేదు. గ్రహించి భర్తని లేపింది. ఆయన వాచ్‌మన్ దగ్గరికి పరుగెడితే 'ఇదిగోసార్! వాల్వ్ ఓపెన్‌చేస్తున్నా... నిద్రపట్టేసింది సార్" అంటూ సంజాయిషీ ఇచ్చాడు.

అప్పటికే నలుగురైదుగురు పోగై విషయం చర్చిస్తున్నారు.

"రావుగారూ! ఆఫీసులకెళ్లాల్సినవాళ్లం. కాస్త సరైన సమయానికి నీళ్లివ్వండి సార్" అన్నారు ఏకకంఠంతో. రావుగారికెంతో అవమానంగా తోచింది. 'ఓకే... ఓకే...' అంటూ సమాధానమిచ్చి, వాచ్‌మన్‌ని పట్టుకుని కేకలేశాడు. "లేదుసార్ నిన్నరాత్రి రిలాక్సయిపోయాను. మీరు చాలా మంచివారు మనుషుల్ని అర్థంచేసుకుంటారని నిజం చెప్పేస్తున్నాను" అని బదులిచ్చాడు.

"అంటే మంచివాళ్లయితే పనిచెయ్యవా?"

"అదేం కాదండి. ఎందుకు చెయ్యనూ... ఈ ఒక్కసారే ఇలా అయింది. సారీసార్" అన్నాడు.

అక్కణ్నించి మొదలైంది ప్రెసిడెంట్ గారిపని.

"పైనించి మా గుమ్మం ముందు సిగరెట్ పీకలూ, చెత్తాచెదారం పడుతోంది. వెంటనే చర్యతీసుకోండి" అంటూ ఒకరి ఫిర్యాదు...

"నీళ్ల టైం మార్చండి" అని కొందరు..

"మెట్లు శుభ్రంగా ఉండటం లేదని ఇంకొందరు..

"ఎప్పుడు పిలిచినా వాచ్‌మన్ పలకడు, వాడెప్పుడూ గేటుదగ్గరుండడు, ఇలా అయితే సెక్యూరిటీ సమస్య వస్తుంది జాగ్రత్త రావూజీ" అంటూ మరికొందరు - రావుగారిని పీక్కుతినేయడం మొదలుపెట్టారు. ఉదయం పదైనా టిఫినూ, ఒంటిగంటదాటినా భోజనం చెయ్యడం రావుకి గగనమైపోతోంది.

"వెధవది... పైసా జీతంబత్తెం లేదు. ఏమిటీ దిక్కుమాలిన చాకిరీ.. మానిపారేయండి" అని శాంత గట్టిగానే అంటోంది.

వారంరోజులు గడిచేసరికి రావుగారి సరదా తుర్రుమని ఎక్కడికో ఎగిరిపోయింది. కళ్లు గుంటలుపడి, కాళ్లు పీక్కుపోయి రెండడుగులు వేయాలన్నా వల్లకాకుండా పోయింది.

కమిటీవారంతా కలిసి "రియల్లీ యు ఆర్ డూయింగ్ వెల్" అంటూ రకరకాల భాషల్లో పొగుడుతున్నా ఓపిక రావడం లేదు. కానీ అలా పొగిడినవాళ్లే సమయం వచ్చినపుడు, చిన్నమెత్తు ఇబ్బంది కలిగినప్పుడు ఛడామడా అడిగేస్తున్నారు.

అపార్టుమెంట్ నిర్వహణకి ప్రత్యేకించి మనుషులెవ్వరూ లేరు. ఉన్న ఒక్క వాచ్‌మన్... ఇటూ అటూ పోతుంటే పలికేందుకు దిక్కుండదు.

"వాడినలా వదిలేసి ఆ ప్రెసిడెంటేం చేస్తున్నాడు?" అంటూ నలుగురూ ధ్వజమెత్తుతున్నారు.

"వాడినేమైనా మా ఇంట్లో కట్టేసుకోమంటారా?" అంటూ శాంత భర్త తరపున వాదించింది.

"కట్టేసుకుంటారో, కాపలా ఉంటారోగానీ పదవిలో ఉన్నప్పుడు బాధ్యతుంటుంది కదా" అని తేల్చారు.

అపార్టుమెంటు కమిటీ ఫ్రీ సర్వీస్ ఏం చేద్దామన్నా డబ్బు చాలదు. డబ్బులిచ్చేవారు తక్కువ. లెక్కలడిగేవారు ఎక్కువ.

చూసేవాడికి చేసేవాడు లోకువ అనే సామెతలాగా ఉంటుంది. ఏడాది గడిచేసరికి ఈ పదవిలోంచి ఎలా బయటపడాలా అనే ఆలోచనలో పడ్డారు ప్రెసిడెంటురావుగారు. *

ఇలా వుందేమో...

ఎన్నార్

ప్రశ్నార్థకం

పేపర్లో క్రైమ్‌న్యూస్ ఇష్టంగా చదివేవాళ్ళు చాలామందే వుంటారు. అందుకే క్రైమ్ రిపోర్టర్‌కి బాగానే ప్రాధాన్యతుంటుంది.

"ఏం సునీల్, ఇవాళన్నీ ఆత్మహత్యలే వున్నట్లున్నాయ్?!" అన్నాడు సిటీడెస్క్ ఇన్‌చార్జ్ ప్రతాప్.

"అవున్సార్, ఇప్పుడు ఒకే ఒక్క హత్య జరగబోతోంది..." అంటూ ఎడంచేతిమీద వాలిన దోమని కుడిచేత్తో బాది చంపాడు.

ప్రతాప్ నవ్వి "నువ్వు మనాఫీస్‌లో నువ్వున్నంతవరకూ మలేరియాలు, చికున్‌గున్యాలూ రావయ్యా" అన్నాడు.

"మా ఆవిడ కూడా ఈ మాటే అంటుంది, నా చెయ్యి ఆలవుట్ కంటే పవర్‌ఫుల్లని"

"ప్చ్.. నిన్ను చూసైనా నేర్చుకోరేంటో జనాలు"

"దోమలు చంపడమా, ఆ టెక్నిక్ అందరికీ రాదులే సార్"

"కాదు, హానిచేసేవాటిని మట్టుబెట్టి మనం సుఖంగా వుండటం"

"భలేవారే, అలా అయితే నిమిషానికో హత్య జరిగిపోతుంది.. ప్రతివాడూ రెండోవాడికి ఎంతోకొంత హాని చేస్తూనే వుంటాడు"

"అసలీ ఆత్మహత్యలు చేసుకోవడమేంటో నాకర్థంకాదు" అన్నాడు లక్ష్మణ్.

"వచ్చిన కష్టం భరించలేనప్పుడు అంతకంటే ఏం చేస్తారు?" అన్నాడు సంపత్. అతనికీమధ్య జీవితం ప్రశ్నార్థకంగా తయారైంది. ఇంటికెళ్ళాలంటే దుర్భరంగా వుంటోంది. విరక్తితో కొన్నిసార్లు చనిపోతే బాగుండును అనుకున్నాడు కూడా.

"కష్టాలు మనుషులకాక్కపోతే మానులకొస్తాయా? అసలు కష్టంలేని మనిషెవరంట? అయినా కష్టనష్టాలుంటేనే జీవితానికో అందం, ఆనందం" అన్నాడు ప్రతాప్.

"ఏం చెప్పారండీ, కష్టాలుంటేనే బాగుంటుందా? చద్దన్నం తిన్నావిడకి మొగుడాకలి తెలీదట. మీకేం జీవితం వడ్డించిన విస్తరిలా వుంది గనుక ఎన్ని కబుర్లయినా చెప్తారు" అన్నాడు సంపత్.

"రెండింటికి డ్యూటీ ముగించుకుని వెళ్తే మా ఆవిడ గుర్రుపెట్టి నిద్దరోతుంటుంది. చల్లారిన పదార్థాలు వచ్చినట్లు నేనే వడ్డించుకు తినాలి" అన్నాడు ప్రతాప్.

"ఇలాంటివేనా మీ దృష్టిలో కష్టాలు?" నవ్వుతూ అడిగాడు సంపత్.



"స్ట్రింగర్ రాసుకొచ్చిన అర్థంపర్థంలేని వార్తలకు, సబ్బులు చేసే (సబెడిటర్లు) తప్పులాతడకలక్కూడా ముందుగా చివాట్లు తినాల్సింది నేనే తెల్సా? అన్నిటికీ పాపాల భైరవుణ్ణి"

"అబ్బో, ఆకాశాన్నే నెత్తిన మోస్తున్నట్లు భలే బిల్డప్పిస్తున్నారండీ.. అలా అంటే కాంప్లిమెంట్లు కొట్టేసేది కూడా మీరేగా"

"హూ.. పూలవర్షమెక్కడ కురుస్తుంది? తప్పులకి మాత్రమే థౌజండ్ కె.ఎం. స్పీడులో స్పందిస్తారు.. ఎన్ని మంచి పాయింట్లున్నా వాటిగురించి నోరు మెదపరు. ఇంతకీ మీరేంటి, ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళని సమర్థిస్తున్నారా?"

"అని కాదు, సమస్యను పరిష్కరించుకోలేమనిపిస్తే.."

"మీ దృష్టిలో చాలా పెద్ద సమస్యేంటో చెప్పండి"

తాను చిక్కుల్లో వున్నట్లు వీళ్ళకెందుకు చెప్పాలనుకుని "నా సంగతి కాదు, అలా చనిపోయేందుకు తెగిస్తున్నారంటే తట్టుకోలేనంత కష్టమున్నట్లే కదా" అన్నాడు సంపత్.

"సరే, చూడండి! ఈ అమ్మాయి పేరు రూప.. ఫొటోలోనే ఇంత అందంగా వుంది, ఊపిరున్న మనిషిగా ఇంకెంత బాగుండి వుంటుందో.. కానీ ఆఫ్టరాల్, ఎంగేజ్‌మెంటయ్యాక పెళ్ళి కాన్సిలైందని సూసైడ్ చేసుకుంది"

"పెళ్ళయ్యాకే విడిపోతున్నారు, ఎంగేజ్‌మెంట్‌కే అంతచేటు ఫీలవ్వాలా?" అన్నాడు లక్ష్మణ్.

"ఈ కుర్రాడు ప్రేమ ఫెయిలైందని హుస్సేన్‌సాగర్లో దూకాడు. ఇలాంటి చావులు రోజుకొక్కటైనా వుంటున్నాయి.. ఇదిగో ఈ నడివయసాయన అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ తరహా చావులు కూడా తరచూ వింటున్నాం. కొన్నిసార్లు భార్యాభర్తా కూడబలుక్కుని మరీ చనిపోతున్నారు. అలాంటప్పుడు అనాథల్లా మిగిలిన వాళ్ళ పిల్లల్ని చూస్తే తెగ జాలేస్తుంది" అంటూ ఒక్కో వార్తను తీసి చూపుతూ మళ్ళీ అతనే "మెజారిటీ భర్త వేధిస్తున్నాడని భార్య, పెళ్ళాం సతాయిస్తోందని మొగుడుగారు బలవంతపు చావును కొనితెచ్చుకుంటున్నారు" అన్నాడు.

రెండు క్షణాలాగి "నువ్వు చెప్పవయ్యా హనుమంతూ, ఏది భరించలేని సమస్యంటావ్?" అనడిగాడు.

"నాదీ మీ రూటే.. ఏవో కష్టనష్టాలుంటేనే జీవితం థ్రిల్లింగా వుంటుంది. ఎలాంటి సమస్య ఎదురైనా ధైర్యంగా నిలిచి పోరాడాలేగానీ పలాయనవాదం చిత్తగించకూడదు" దృఢంగా అన్నాడు హనుమంతు.

అతనిగురించి సంపత్‌కి కొంత తెలుసు. హనుమంతు పదో తరగతిలో వుండగానే తండ్రి చనిపోతే కుటుంబభారమంతా తలపై వేసుకున్నాడని, అందువల్ల పెద్దగా చదువుకోలేకపోయాడని, ప్రైవేటుగా డిగ్రీ రాస్తున్నాడని, ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేయడానిగ్గానూ ఎన్నో తంటాలు పడ్తున్నాడని విన్నందున అతనంటే ఒకవిధమైన అభిమానం.

"..అందరి స్థితిగతులూ ఒకలా వుండవు. ఎవరికి తగ్గ సమస్యలు వాళ్ళకుంటాయి. కడవంత గుమ్మడికాయ కూడా కత్తిపీటకు లోకువ అన్నట్లు ఎంతలావు సమస్య అయినా తెలివిగా ఆలోచిస్తే ఇట్టే పరిష్కారమౌతుంది" అన్నాడు హనుమంతు.

సంపత్‌కి చెల్లెలు కళ్ళముందు మెదిలింది. భర్త చనిపోగా ఇద్దరు పిల్లలతో తన పంచన చేరింది. అటు చదువు, ఉద్యోగమూ లేవు, ఇటు భర్త తరపు ఆస్తి కూడా ఏమీలేదు. భార్య ఆమె బాధ్యత మనది కాదంటూ రోజూ పోట్లాట పెట్టుకుంటోంది. అలాని నిరాశ్రయురాలైన చెల్లెల్ని ఇంటినుండి ఎలా పంపడమో తెలీక కుమిలిపోతున్న సంపత్‌కి ఇప్పుడే జ్ఞానోదయం లాంటిదైంది. 'పూర్తిగా చెల్లెలి భారాన్ని మోయకుండా, అసలే గెంటేయకుండా మధ్యేమార్గంకోసం అన్వేషిస్తే ఇక ప్రశ్నార్థకమేముంది?!' అనుకుని తల పంకించాడు. *

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

(పటేలుకు పాతరోజులు గుర్తొచ్చాయి. అతడు పటేలుగిరీకి వచ్చిన తొలిరోజులన్లో ఊళ్ళో సంబరాలు చేసుకోవడంకోసం అందరితోబాటు అతడిని కూడా చందా ఇమ్మని అడగడం నచ్చకున్నా బలవంతపెట్టడంతో ఇచ్చి, ఆనక మరో నెపంతో పోలీసును పిల్చి బెదిరించి అంతకన్నా ఎక్కువ సొమ్ము రాబట్టాడు. ఇప్పటి గడ్డురోజుల్లో వాటిని పోల్చుకునేసరికి అతడి గుండె చెరువైపోయింది)

(24 వ భాగం)



ఆమె నెమ్మదిగా కదిలింది. ముఖం వరకు ముసుగును తొలగించి "నేను లేవలేను కాని ఉయ్యాల్లో ఉన్న పిల్లను ఇటు పక్కలో పడేయవయ్యా" అంది.

అతడు ఉయ్యాల్లో ఉన్న పిల్లను తెచ్చి ఆమె పక్కలో పడుకోబెట్టాడు. పిల్ల కేరుమంటూ ఏడ్చింది. పిల్ల నోటికి ఆమె రొమ్ముపట్టింది. పిల్ల వెంటనే ఏడుపుమాని పాలు తాగుతూ పడుకుంది.

"ఇక పడుకోనా?" అడిగాడు పటేలు.

"పడుకోవయ్యా" అందామె మూల్గుతూ. తిరిగి "ఏమయ్యో పాలలో తోడు వేశావా?" అంది.

ఆ పూట పాలు తీయలేదన్న విషయం అతడికిప్పుడే గుర్తొచ్చింది. "అయ్యో అసలు పాలుతీయనేలేదు" అన్నాడు.

"ఎట్టాగయ్యా? అది అసలే మలప సన్నాసి. ఈరోజు వదిలితే రేపు దగ్గర కూర్చోనిస్తుందా?"

''సరేలే నేను పోయి కూర్చుంటా కాని చేపుద్దా?''

"ఎందుకు చేపదయ్యా? నా పాత చీర ముక్కొకటి దండేన ఉంది. ఆ ముక్క నెత్తిన పడేసుకుని కూర్చో"

అతడు నవ్వాడు "ఎందుకులెద్దూ. ఇంకా నెల పొడవలేదు కదా? ఇంత చీకటిలో కూడా గుర్తుపడుతుందంటావా?" అన్నాడు. అతడు వంటగదిలోకెళ్లి పాలతపేళా తీసుకుని తోడు పాలు పోసుకుని సందు గడియ తీసి గేదె వద్దకు పోయి కూర్చున్నాడు. గేదె వెనక్కి మోర తిప్పి మిర్రి చూస్తూ జాడించి తన్నింది. అతడి చేతిలో ఉన్న తపేళా దూరంగా పోయి పడింది.

"ఓసి నీ దుంప తెగా" అంటూ లేచాడు. కిందపడిన తప్పేలా తీసుకుని గబగబా ఇంట్లోకొచ్చాడు. ధోవతి చెంగులు పైకి దోపుకున్నాడు. దండెంమీదున్న భార్య చీర మొలకు చుట్టుకున్నాడు. మిగిలింది తలపై ముసుగేసుకుని తప్పేళాతో తిరిగి గేదె వద్దకెళ్లి వెన్ను చరిచి పొదుగు వద్ద కూర్చున్నాడు. చేయి పెట్టగానే గేదె చేపుకు వచ్చింది. అతడు తప్పేళా కాళ్లసందున ఇరికించుకుని పాలు పిదకడం ప్రారంభించాడు.

అంతలో సందు ద్వారబందం వద్ద గాజుల చప్పుడు వినిపించింది. అతడు వెనక్కి తిరిగి చూశాడు. శాంతమ్మ సమీపంలోకొచ్చి నిలబడి ఉంది.

''చీరకట్టుకుంటే ఎంత బాగున్నావయ్యా?" అందామె.

ఆ మాటలతో అతడొంతగానో బిడియపడ్డాడు. భార్యపై కోపమూ వచ్చింది. "పో, పో ఇక్కడికెందుకొచ్చావు?" అన్నాడు.

"కాదయ్యా, గదిలో చప్పుడు వినిపించి



ముసుగు తీసి చూశాను. నీవు చీర కట్టుకుంటున్నావు. బొద్దుగా ఉన్నావుకదూ. ఎంత బాగున్నావనీ?" అందామె. "ఓసి, నోర్మూయ్యవే. బుద్ధిలేక కట్టుకున్నాను" అన్నాడతడు విసుక్కుంటూ.

"అబ్బబ్బా, ఎందుకయ్యా అంతగా విసుక్కుంటావూ? ముచ్చటగా ఉన్నందుకేగా జ్వరంతో కూడా చూడడానికొచ్చానూ?"

"చాల్లే పోయి పడుకో" అని గద్దించాడు.

అంతలో పడమర వీధినుండి కేకలు, బొబ్బలు వినిపించాయ్. అతడి హృదయం దడదడాకొట్టుకుంది. ఈ కేకలు సంఘం వాళ్ళవేనని నిర్ణయించుకున్నాడు. అతడిలో విపరీతమైన భయం పుట్టుకొచ్చింది. గబగబా పాలు పిదుకనారంభించాడు.

''సంఘం వర్ధిల్లాలి'' ''తెలుగుతల్లి వర్ధిల్లాలి''

"సంఘం నాయకుడు రాజారెడ్డి వర్ధిల్లాలి" ఇలాంటి కేకలు నూరు కంఠాలతో ఐక్య కంఠంగా వినిపిస్తున్నాయ్.

"ఏమిటయ్యా ఆ కేకలు?" అనడిగిందామె.

"సంఘం వాళ్లేమో" అన్నాడతను.

"అయితే మట్టుకు ఇంత రాత్రివేళ ఆ అరుపులేమిటీ?" అందామె.

"నాకు మాత్రం ఏం తెలుసు?" అన్నాడతడు. ఇంకా కొన్ని పాలను గేదె పొదుగులోనే వదిలేసి ఆదుర్దాగా లేచాడు.

"వాళ్లు మన వీధికే వస్తున్నారట్లుంది" అందామె.

అతడు మారు మాట్లాడకుండా తప్పేళా తీసుకుని లోపలికి నడిచాడు. అతడివెంట ఆమె లోపలికి వెళ్లిపోయింది.

"పటేలు, పట్వారీల దౌర్జన్యం నశించాలి"

"నిరంకుశ పరిపాలనా విధానం అడుగంటాలి"

''వెట్టి చాకిరీని మట్టు పెట్టాలి''

ఇలాంటి అరుపులు అమితంగా వినిపిస్తున్నాయి. కాసేపటిలోనే ఆ గుంపు వారంతా తమ ఇంటికొచ్చినట్లుగానే సందడి వినిపించింది. భార్యాభర్తలిద్దరూ హాల్లో నిలబడి ఒకరి ముఖం ఒకరు చూసుకుంటున్నారు. అంతలోనే బయటినుండి గంభీరమైన కంఠం ఒకటి "తలుపుతీయండి" అంది.

పటేలు తలుపులు తీయడమా? మానడమా? అని సందేహంలోపడి వణుకుతున్నాడు. శాంతమ్మ మాత్రం భర్తను అడక్కుండానే గబగబా వెళ్లి గడియతీసి తలుపులు బార్లా తెరిచింది. వెలుపల నిలబడిఉన్న జనసమూహాన్ని చూసి ఒకడుగు వెనక్కేసింది.

పదిమంది ఒక్కసారిగా లోపలికి నెట్టుకొచ్చారు. పది చేలైట్లు ఒక్కసారిగా వెలిగాయి. పటేలు గుండెలు పగిలిపోయాయి. తలమీద ముసుగు సరిచేసుకుని తలొంచుకుని నిల్చున్నాడు.

తుపాకీ చేతిలో ఉన్న యువకుడొకడు ముందుకొచ్చాడు. "పటేలు అయోధ్యరాంరెడ్డి ఎక్కడ?" అని ప్రశ్నించాడు.

శాంతమ్మ భర్తవైపు చూసింది. అతడు ముఖం కనిపించకుండా ఇంకొక వైపుకు తిరిగి తలొంచుకుని నిలబడి ఉన్నాడు. భర్త ఇంట్లో ఉన్నాడని చెప్పడమా? మానడమా? అని ఆలోచిస్తోంది. అంతలోనే...

"ఏమమ్మా నిన్నే అడుగుతున్నాను" అన్నాడా యువకుడు తిరిగి.

"ఆయన ఇంట్లో లేడు" అని జవాబిచ్చింది.

"అబద్ధమాడుతున్నావా?" గద్దించి అన్నాడా యువకుడు.

"లేదు నాయనా ఊరికెళ్లాడు" అందామె.

ఆ యువకుడు చీరకట్టుకున్న పటేలు వైపుకు అనుమానంగా చూసి "ఈమె ఎవరు?" అనడిగాడు.

"మా అక్కయ్య నాయనా. రాత్రే చుట్టపుచూపుగా వచ్చింది" అందామె తడుముకోకుండానే.

''సరే ఇంతకూ ఇంట్లో పటేలు లేడంటావు. అవునా?''

''లేదు నాయనా. పెద్దదాన్ని అబద్ధమాడుతానా?''

"సరే నీతో అబద్ధం ఆడించడం నాకూ ఇష్టం లేదు. పటేలుగారి దస్త్రం తెచ్చివ్వు వెళ్లిపోతాం" అన్నాడాయువకుడు.

అతడినోటినుండి వెళ్తామనే మాటొచ్చేసరికి ఆమె ప్రాణం ఎంతో తేలికపడింది. ఆదరాబాదరాగా పోయి బీరువా తెరిచి దస్త్రం తెచ్చి ఆ యువకుడి ముందుంచింది.

వచ్చినవారిలో ఒకడు ముందుకొచ్చి దస్త్రం చేతిలోకి తీసుకున్నాడు. మరుక్షణమే ఆ గుంపంతా అక్కడినుండి కదిలిపోయింది.

రెండు నిమిషాలు గడిచిపోయాయి.

పటేలు ముసుగు తీసి లేవబోయాడు. శాంతమ్మ అడ్డుకుని "అప్పుడే బయటపడకయ్యా. చాటునా, మాటునా ఎవరైనా ఉండి చూస్తారేమో" అందామె.

తీసేయబోతున్న ముసుగును తిరిగి సవరించుకున్న పటేలు "ఇట్లా

ఎంతకాలం ఈ వేషంలో ఉండాలంటావు?" అన్నాడు.

"ఎంత కాలమేమిటయ్యా? ఇప్పుడు బయల్దేరి ఈ ఊరినుండి వెళ్లిపోవలసిందే. అమ్మో ఆ గుంపును చూశావయ్యా? అంతమంది కళ్లలోపడితే నిన్ను బతకనిచ్చేవాళ్లేనా?" అందామె. అతడు సాలోచనగా తలూపి "వెళ్లడమే మంచిది" అన్నాడు.

"నెమ్మదిగా అంటావేంటి? ఎడ్లను, బండిని సాగవేయించు" అందామె.

"ఈ రాత్రే వెళ్లిపోదామా? అయితే బయట వరండాలో పడుకున్న అబ్బాయిని పిల్చుకురా"

ఆమె బయటికెళ్లాలని రెండడుగులేసి ఆగిపోయింది. "చూశావయ్యా? ఇంత అల్లరి జరిగిపోయింది గదా? అబ్బాయికి నిద్ర మెలకువే రాలేదూ?!" అంది.

"వెధవ, ఒట్టి మొద్దు నిద్ర సన్నాసి. ఇల్లంతా దోచుకుపోయినా వీడింతే" అన్నాడతను.

తర్వాత ఆమె వరండాలోకెళ్ళి మైమరచి నిద్రపోతున్న కొడుకును గట్టిగా పిలిచింది. చేతికొద్దీ వంటిపై చరిచింది. తర్వాత దభీదభీమంటూ బాదింది.

చివరికతను "అబ్బబ్బ" అంటూ ఇంకోపక్కకు తిరిగి పడుకున్నాడు.

"ఒరే మొద్దూ, లేవరా" అని అరిచి, తిరిగి అతడి వీపుపై గట్టిగా చరిచింది.

"అబ్బా, ఏమిటమ్మా?" అన్నాడతడు. నిద్రకళ్ళతో లేచికూర్చుని ఊగుతున్నాడు. ఆమె అతని రెక్కపట్టుకుని విదిలిస్తూ లేవదీసి నిలబెట్టింది. "మీ అయ్య పిలుస్తున్నాడురా పద" అంది.

"అప్పుడే కోడి కూసిందా ఏమిటే? లేపావు" అన్నాడు గజ్జెలరెడ్డి.

ఆమె రెక్కపట్టుకుని ఈడ్చుకుపోతుంటే వేలగిలబడుతూ ఇంట్లోకెళ్లాడు. ఆడవేషంలో ఉన్న తండ్రిని చూసేసరికి అతడి నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది. అతడు పూర్తిగా ప్రపంచంలోకొచ్చాడు.

"ఏందయ్యా చీర కట్టుకున్నావు?" అడిగాడు.

తండ్రి మాట్లాడకుండా తలొంచుకుని కూర్చున్నాడు. తల్లి మాత్రం జరిగిన విషయమంతా నాలుగుమాటల్లో గబగబా చెప్పింది. చివరన మాత్రం "ఈ ఊళ్లో మనల్ని బతకనివ్వరు. వెళ్ళిపోదాం" అంది. విషయమంతా తెల్సుకునేసరికి గజ్జెలరెడ్డికి రోషం పొడుచుకునివచ్చింది. "మన ఇంటిమీదబడి ఇంత అల్లరి జరుపుతుంటే నన్ను కాస్త లేపగూడదూ?! ఒక్కొక్కళ్లని నడుములు విరిగేట్లు తన్ని పంపేవాణ్ని" అన్నాడు.

"చానా ఏడ్చావులే ఎడ్లనుతోలుకొచ్చి బండికట్టుకుని వెళ్లిపోదాం" అన్నాడు పటేలు.

తండ్రి మాటలతో గజ్జెలరెడ్డి ముడుచుకుపోయాడు. ఇంతరాత్రివేళ బండి కట్టడమేమిటా అని ఆలోచన చేస్తున్నాడు. ఇంతలో

"నిలబడ్డావేమిట్రా?" అన్నాడు తండ్రి.

"బండి ఇప్పుడే కట్టమంటావా అయ్యా?" అనడిగాడు గజ్జెలరెడ్డి.

"ఇప్పుడే మరీ" అన్నాడు తండ్రి.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

రెడీ అవ్వండి మరి...

కె శివలీల

ఉదయం పదిగంటలు... టంగ్ మంటూ మోగుతున్న గడియారం వంక బాధగా చూసిందా అమ్మాయి. వారంరోజుల తర్వాత... నేనీపాటికి ఎంచక్కా..... గాల్లో తేలిపోవాల్సిన ఆ అమ్మాయి ఆలోచనలకు బ్రేక్ పడిండి. హు... అంటూ అసహనంగా తల విదిలించింది. 'ఈ వారం రోజులూ గడిచేదెలా?' దిగులుగా అనుకుందా అమ్మాయి. చిరాగ్గా బాల్కనీలోకొచ్చింది. ఇంతలో 'బాయ్, డియర్...' అంటూ స్కూటీలో రైమంటూ దూసుకుపోతోంది ఆమె స్నేహితురాలు... ఎక్కడికబ్బా? కాలేజీకి? దాంతో ఆమె బాధ మరీ రెట్టింపయ్యింది. కారణం? తమ కాలేజీ ఆలస్యంగా రివోపన్ చేయడం. కాలేజీలన్నీ ఓ పదిరోజులు అటో ఇటో తెరుస్తారు. మరి మొదటిరోజే విధ్యార్థులు కాలేజీకెళతారా? తమ కాలేజ్ రివోపనింగ్ డే కొద్ది రోజులు ఆలస్యమని విద్యార్థులకు తెలిసిందనుకోండి... అప్పుడు వారెలా ఫీలవుతారు? తెలుసుకోవాలంటే.....

"ఇప్పటి వరకూ రోజులు క్షణాల్లా గడిచాయి. ఈ వారం రోజులూ గడపడమెలా అని తల్చుకుంటే చాలు తలప్రాణం తోకకొస్తోంది" అంటోంది ప్రణీత. కారణమేంటో.. "ఈ సమ్మర్ హాలిడేస్ మా స్నేహితులతో చాలా చక్కగా గడిపాను. మా ఫ్రెండ్స్ వెళుతున్న కాలేజీలన్నీ రివోపన్ చేశారు. వాళ్లందరూ చక్కగా కాలేజీకెళుతున్నారు. మా కాలేజీ తెరవడానికి ఇంకా వారంరోజుల గడువుంది. ఈ సంగతే నన్ను బాధపెడుతుంటే... ఇక మా ఫ్రెండ్స్ కాలేజ్ నుంచి నరానరి మా ఇంటికొచ్చి, అక్కడ వాళ్లు చేసిన అల్లరి పనులన్నీ పొల్లుపోకుండా చెబుతూనే ఉంటారు. దాంతో నాకు పుండుమీద కారం రాసినట్లుగా ఉంటుంది. ఈ వారం రోజులూ ఎలా గడపాలో ఏంటో..." అంటూ చాలా దిగులుపడుతోంది.

"కాలేజీలెప్పుడు తెరుస్తారా అని ఆసక్తిగా ఎదురుచూశాను. ఎదురుచూసిన సమయం రానే వచ్చింది. కాలేజీ మొదటిరోజు కదా... చాలా చక్కగా రెడీ అయి వెళ్లాను. తీరా వెళ్లిచూస్తే... క్లాస్‌మేట్స్ వచ్చారు. కానీ నా ఫ్రెండ్స్ మాత్రం ఎవరూ రాలేదు. ఎందుకబ్బా అని ఆరా తీస్తే తెలిసింది. మొదటి పదిహేనురోజులూ పెద్దగా క్లాసులేం ఉండవు కదా దీపూ... రావడమెందుకనీ... అయినా ఒకసారి స్టడీస్‌లో పడినతర్వాత ఇంట్లో వాళ్లతో ఇంత ఫ్రీగా గడపడం కష్టం కదా... అంటూ ఎక్స్‌ప్లనేషన్లు. ఇన్ని రోజుల తర్వాత కాలేజ్‌మేట్స్‌ను కలుస్తున్నాం... అన్నఫీలింగే లేదు వీళ్లకు. అయినా వీరికోసం ఇంత శ్రమపడి రెడీ అయి కాలేజీకి రావడం నాదే బుద్ధితక్కువ అనుకున్నాన్నేను" అంటోంది దీప.

కాలేజ్ రివోపనింగ్ డే విషయంపై అమ్మాయిలిలా స్పందిస్తే, మరి అబ్బాయిల సంగతో... "మా కాలేజీ ఇంకో పది రోజుల్లో రివోపన్ చేస్తారు. కానీ రివోపనింగ్ రోజే కాలేజీకెళ్లాలంటే... బోర్... ఫ్రెషర్స్ వచ్చిన తరువాత అయితే చాలా థ్రిల్లింగా ఉంటుంది. వారిని సరదాగా ర్యాగింగ్ చేయొచ్చు. మా కాలేజీలో ర్యాగింగ్ ప్రొహిబిటెడ్. బట్... తల్చుకుంటే ఏదో నెపాన ఏడ్పించడం చేయొచ్చుగా. అందుకే వారి రాకకోసం వెయిట్ చేస్తున్నా" అంటున్నాడో అబ్బాయి.

"కాలేజీ తెరిచిన రోజే నేను అటెండవుతాను. క్లాసులో కూర్చున్నా కూర్చోకపోయినా ప్రొఫెసర్స్‌ను కలుస్తాను. ఆ సెమిస్టర్‌కు నిర్దేశించిన సిలబస్ పేపర్ కలెక్ట్ చేసుకుంటాను. అంటే చదివేస్తానని మాత్రం పొరబాటు పడకండి. దాంట్లో ఉన్న రిఫరెన్సు బుక్సు వెతకటంలో నిమగ్నమైపోతాను. నేను స్టడీస్‌లో ముందుండడానికి రహస్యం ఇదే. కాలేజీకి ఒక న్యూలుక్ వచ్చేది ఫ్రెషర్స్‌తోనే... వారి రాకతోనే కాలేజీకి నిండుతనం వస్తుంది. కొంచెం నా పనీ సులువవుతుంది. ఎలాగంటారా కొన్ని రిఫరెన్సు బుక్కు ఎంత వెతికినా కనబడవు కదా... బహుశా వేరే సెక్షన్స్‌లో మిస్‌ప్లేస్ అయ్యింటాయి. అలాంటప్పుడు వాటిని వెతకాలంటే ఫ్రెషర్స్ సాయం తప్పనిసరి" అంటాడు ఎంసిఏ ఫైనలియర్ కెళుతున్న శంకర్.

"ఇంట్లో మనమెలా ఉన్నా ఎవరూ పట్టించుకోరు. మనం స్టైలిష్‌గా రెడీ అయినా అమ్మానాన్నలైతే ఏమీ అనరనుకోండి. పక్కింటివారు, ఇంటికొచ్చిన ఫ్రెండ్సుతోనే బాధంతా. 'అబ్బా ఇంట్లోనూ ఇంత గ్లామర్ మేయిన్‌టెయిన్ చేయడం

అవసరమా!' అంటూ సెటైర్స్ వేస్తారు. అందుకే మన స్టైలును ప్రదర్శించడానికి మంచి స్పాట్ కాలేజీ... కానీ దురదృష్టావశాత్తూ సమ్మర్ హాలిడేస్ ఇచ్చేస్తారు? దాంతో ఇక నాలుగ్గోడల మధ్య ఉండాలంటే నాకు చాలా బాధగా ఉంటుంది. కానీ ఈ సమయాన్ని నేను భలే సద్వినియోగం చేసుకుంటాను" అంటాడు సెంట్‌మేరీస్ కాలేజీ విద్యార్థి రణ్‌ధీర్. ఎలాగంటే సమ్మర్ హాలిడేస్‌లో నా కాన్సన్‌ట్రేషన్ అంతా బాడీ పైనే చూపుతాను. ఆరోగ్యంగానూ ఉండొచ్చు... బాడీని బిల్డప్ చేయొచ్చు - అంటున్నాడీ అబ్బాయి. బాడీపైన కాన్సన్‌ట్రేషనేంటి అనుకున్నారా? అదేనండీ సమ్మర్‌లో జిమ్‌లో వ్యాయామం చేస్తూ, స్విమ్మింగ్‌పూల్లో స్విమ్ చేస్తూ గడుపుతాడట.

అయ్యో... సమ్మర్ హాలిడేస్‌లో జిమ్‌కెళ్లినా బాగుండేది... బాడీ బిల్డర్‌లా కాకపోయినా కొంచెం మాన్లీగా కనిపించే వాళ్లం కదా అనుకుంటున్నారా? ఇంత ఆలస్యంగా బల్బు వెలిగితే ఎలా? ఇలాగే ఆలోచిస్తూ గడిపేస్తారా ఏంటి? ఈ సమ్మర్ పోతే పోయింది నెక్ట్స్ సమ్మర్ ఉందిగా... ఇక కాలేజీకెళ్లడానికి రెడీ అవ్వండి మరి.

*

చందు

కథానాయిక పాత్ర మినహాయిస్తే ఆమె వేయని వేషం లేదు. చిన్నపిల్లలా అమాయకంగా నటించడంలో ఆమెది ప్రత్యేక శైలి. నట జీవితంలో అక్క, చెల్లెలు, వదిన, కోడలు, అమ్మ వంటి ఎన్నో పాత్రలను దాటి ప్రస్తుతం అమ్మమ్మ, జేజమ్మ పాత్రలతో కనువిందు చేస్తోంది. అమ్మమ్మ, జేజమ్మ పాత్రలకు పెట్టింది పేరైన నిర్మలమ్మ స్థానాన్ని కొంతవరకు భర్తీ చేసింది. 1500 పై చిలుకు చిత్రాల్లో నటించి ప్రేక్షక నీరాజనాలందుకున్న రమాప్రభ చెప్పిన ముచ్చట్లు...

అమ్మానాన్నల్ని చిన్నమ్మ, చిన్నాన్న అని పిలిచేదాన్ని...

నేను పుట్టింది అనంతపురం జిల్లా కదిరి. ఒకటో క్లాస్ కూడా చదువుకోలేదు. మా మేనత్తకి పిల్లలు లేకపోవడంతో ఆవిడ నన్ను పెంచుకుంది. వాళ్ళు మద్రాసులో ఉండేవారు. దీంతో పుట్టిన రెండు నెలలకే నన్ను మేనత్త తీసుకెళ్ళిపోయింది. మేనత్తను అమ్మ అని, మేనమామను బాబా అని పిలవడం అలవాటై పోయింది. కన్న తల్లితండ్రులు ఉన్నారన్న సంగతి పదమూడేళ్ళు వచ్చేవరకు తెలీదు. కన్నవాళ్ళను చిన్నమ్మ, చిన్నాన్న అని పిలిచేదాన్ని. ఊహ వచ్చినప్పటి నుంచీ భరతనాట్యం నేర్చుకున్నా. నాటకాలు ఆడేదాన్ని. బాలచందర్, ఆర్.ఎస్. మనోహర్, ముత్తురామన్ వంటి ప్రముఖుల ట్రూప్‌లో నాటకాలు ఆడాను. ఇండస్ట్రీకి రావాలన్న కోరికా లేదు, ఇష్టమూ లేదు. ప్రేరేపించిన అంశాలూ, ఆశయమంటూ ఏవీ లేవు. బాబా(మేనమాన) చనిపోవడంతో సినిమారంగంలోకి రావాల్సివచ్చింది. ప్రత్యగాత్మగారి దర్శకత్వంలో వచ్చిన 'చిలక-గోరింక' నా తొలి చిత్రం. కృష్ణంరాజుగారికి కూడా అదే మొదటి చిత్రం. అందులో మేమిద్దరం అన్నాచెల్లెళ్ళుగా నటించాం. నెలల పాపగా ఉన్నప్పుడే మద్రాస్ వెళ్ళిపోవడంతో 20, 30 చిత్రాల వరకు తెలుగు మాట్లాడడం కష్టంగా అనిపించేది. ప్రస్తుతమైతే తెలుగు, తమిళం చదవగలను. కానీ డైలాగ్స్ విని చెబుతూ ఉంటా.

ఇప్పటికీ నటించడమే లభించిన అత్యున్నత గౌరవం

నిర్మలమ్మ తర్వాత సీనియర్లలో నటిస్తున్న ఆడవాళ్ళలో నేనొక్కదాన్నే ఉన్నాను. జమున, అంజలీదేవి వంటి సీనియర్లు ప్రస్తుతం నటించడం లేదు. నా పదహారేళ్ళప్పుడు నటించడానికి వచ్చి అరవైయేళ్ళొచ్చినా ఇంకా నటిస్తూనే ఉన్నాను. అది సాయిబాబా ఇచ్చిన బహుమతిగా భావిస్తాను. నా వరకు నేను నటన విషయంలో నిజాయితీగా, శ్రద్ధాసక్తులతో నడుచుకుంటాను. కాబట్టే వేషాలింకా వస్తున్నాయనుకుంటున్నా. నా కెరీర్ హ్యాపీగా సాగుతోంది. నా అంత సంతృప్తిగా వేషాలేసినవాళ్ళు ఎవరూ లేరు. నేను సంపాదించినన్ని అవార్డులు, రివార్డులు ఇండస్ట్రీలో ఏ హీరోహీరోయినూ పొందలేదని చెప్పగలను. నేనంటే ఎవరికీ శత్రుభావం లేకపోవడంతో 43 ఏళ్ళపాటు కెరీర్ కొనసాగిగించగలిగాను. ఇప్పటికి కూడా నటించడమే నేను జీవితంలో సాధించిన అత్యున్నత గౌరవం. ఛానల్స్ రావడంతో ఇవ్వాళ్టి జనరేషన్ పాత చిత్రాలు చూసి 'ఇప్పుడు మనం చూస్తున్న అమ్మమ్మేగా ఆవిడ... ఇప్పుడు చూస్తున్న జేజెమ్మే కదా! ఆవిడ... అని అనుకుంటున్నారు. నన్ను గుర్తుపట్టి చిన్నపిల్లలు కూడా పలకరిస్తున్నారంటే ఇంతకంటే సాధించాల్సింది ఏముంటుంది? 'ఆంటీ మీ చిన్నప్పటి సినిమా చూశాం' అని చిన్నపిల్లలు అంటున్నారు. ఏ హీరో సినిమా చూసినా అందులో నేనుంటాను. ప్రేక్షకులు నాకోసం సినిమా చూడకపోయినా, నా ఉనికి సినిమాలో ఉంది.

మేము ప్రేక్షకులకి ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే

నన్ను ఇష్టపడే అభిమానులందరూ నా వయసులో ఉన్నారు. వారికి నాపట్ల క్రేజ్ కంటే ఆప్యాయత, అభిమానమే మిగిలింది. నాలాగా వాళ్ళూ తక్కువమందే ఉన్నారు. ఇప్పుడున్న యూత్‌కి అనుబంధం, అభిమానం లాంటివి లేవు. సెంటిమెంట్ అంటే ఏమిటో కూడా తెలియదు. ఒక ఫ్యామిలీలో ముగ్గురు అన్నలు, ఒక చెల్లెలు ఉన్నారనుకోండి... చెల్లి స్కూలుకి వెళ్ళేటప్పుడు 'స్కూల్‌కి జాగ్రత్తగా వెళ్ళిరామ్మా' అని పెద్దన్న మాట్లాడే తీరు ఆత్మీయంగా ఉంటుంది. 'ఆకలేస్తే తినడానికి ఏమన్నా బాక్సులో పెట్టావా?' అని భార్యను అడుగుతాడు. 'ఏంటి జాగ్రత్తగా వెళ్తున్నావా?' అని రెండోవాడు అంటాడు. 'హాయ్' అనే పలకరింపుతో మూడోవాడు సరిపెట్టుకుంటాడు. ఇక నాలుగోవాడి పలుకే బంగారం. జనరేషన్ గ్యాప్ కారణంగా సెంటిమెంట్ కూడా తగ్గిపోతోంది. తక్కువ సెంటిమెంట్ ఉన్నవాళ్ళకి పుట్టబోయే పిల్లలకు సెంటిమెంట్ అంటే ఏమిటో కూడా తెలీదు. ఇప్పటి అమ్మాయిలూ, అబ్బాయిలూ రోడ్లమీద డాన్స్ చేయడం మొదలు పెట్టారు. మాకూ, వాళ్ళకూ తేడా ఏముంది? డాన్సులు, ఫైట్ల గొడవలో వాళ్ళకి మేమేం నచ్చుతాం? మమ్మల్ని చూడరు. మేము ప్రేక్షకులకి కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే. బఫూన్లమన్న మాట. అన్నమాట కాదు... ఉన్న మాటే. వాళ్ళ టైమ్ పాస్ కోసం మేము పనిచేస్తున్నాం. నా స్థానంలో ఎవరిని చూపించినా చూస్తారు. నామీదే గనుక అభిమానం ఉంటే 'మీరు లేని సినిమా చూడం' అని అంటారు? మా పాత రోజుల్లో నాగేశ్వరరావు లేకపోతే సినిమా చూడం. రామారావు లేకపోతే సినిమా చూడం. రాజబాబు, రమాప్రభ లేకపోతే సినిమా చూడం - అని అనేవాళ్ళు. ఇప్పుడు వాళ్ళ వయసు అయిపోయింది. వాళ్ళు నా సమకాలికులు.

ఎడ్జెస్ట్ అయిపోతా

మగవాళ్ళు ఎప్పుడూ వయసులోనే ఉంటారు. ముసలివాళ్ళు అయినా కూడా యూత్ కిందే లెక్క. కానీ మాకు వయసొస్తే కనీసం పలకరించరు కూడా. పాత రోజుల్లో ఏవైనా ఫంక్షన్లకు వెళ్ళి అర్జెంటుగా షూటింగ్‌కి వెళ్ళాల్సివస్తే 'ముందు రాజబాబు, రమాప్రభలను పపించండయ్యా..' అని పెద్ద హీరోలు చెప్పిన రోజులున్నాయి. అలాంటి విలువ, గౌరవం పొంది ఇప్పుడున్న కొత్తవాళ్ళ కోసం ఫంక్షన్లకు వెళ్ళి కూర్చోలేం. కానీ ఇప్పటివాళ్ళలో కొంతమంది యూత్ ఎన్.టి.ఆర్., నితిన్, అల్లు అర్జున్ నేనంటే అభిమానం చూపిస్తున్నారు. సరదాగా ఉంటున్నారు. అలాగే కొంతమంది కథానాయికలు. వాళ్ళతో నేను అడ్జెస్ట్ అయిపోయి చాలా సరదాగా ఉంటాను కాబట్టి పాతతరం దాన్ని, పెద్దదాన్ననే భావన వాళ్ళకి కలగదు. ఆ అభిమానంతోనే రెండురోజుల షూటింగ్‌కోసం 'అశోక్' చిత్రానిగ్గాను నన్నే పిలిపించారు. ఒక వయసొచ్చిన తర్వాత కూడా చాలా చిత్రాల్లో చిన్నపిల్లల, అమాయక పాత్రలను ఎక్కువగా పోషించాను. ఆ తరహా పాత్రలు ఎక్కువగా ధరించడం కారణంగా ఆ స్టైల్ ఇంకా రక్తంలో ఉండి యువతతో ఎడ్జెస్ట్ అయిపోతున్నానేమో!

ప్రేరణిచ్చే సందేశాలివ్వాలి

'ఈ కలర్ డ్రస్సంటే ఇష్టం. ఫలానా కంపెనీ కారంటే ఇష్టం...' అని ప్రముఖ స్థానాల్లో ఉన్నవారు, జనాదరణ పొందినవారు చెబుతుంటారు. అది వారి అనుభవం. కానీ అవన్నీ పబ్లిక్‌కు అవసరమా? కోట్లమందిలో చివరికి ఒక్కరికైనా పనికొచ్చే సందేశం ఇస్తే వయసుకు తగ్గట్టు ఉంటుంది. అలా ఎంతమంది ఇస్తున్నారు? ఏదైనా సందేశమిస్తే ప్రేరణ చెందేలా ఉండాలే గానీ చొల్లు కబుర్లతో కాలక్షేపం చేయకూడదు.

(ఇంకా వుంది) *

ప్లేట్ పపెట్

హేయ్ బుజ్జాయిలూ.... మేం వారం వారం ఏదో ఒక బొమ్మ నేర్పిస్తున్నాం కదా. మరి చేసేస్తున్నారా! మాకు తెలుసులే. మీరు పేపర్ రాగానే స్నేహ పుస్తకం తీసుకుని ఈ బొమ్మను చేయడం ఎలాగో నేర్చుకుంటారని. మరి ఇవాళ ఏం చెప్పబోతున్నామనుకుంటున్నారు! మీరు అప్పుడప్పుడు మీ నేస్తాలను తలుపుచాటునో, కర్టెన్ చాటునో నిలబడి అకస్మాత్తుగా బయటకు వచ్చి 'బావ్' అని భయపెడుతుంటారుకదా. అప్పడే మీ చేతికో, మొహానికో ఓ మాస్కు వుందనుకోండి. వాళ్లు మరింత హడలిపోతారు. ఆ మాస్కు తయారుచేయడం ఎలాగో ఇవాళ చెప్పబోతున్నాం. సంతోషమేనా! కానీ ఒక షరతు. చేసిన తర్వాత మరీ పసిపిల్లలనుగానీ, ముసలివాళ్లనుగానీ దీనితో భయపెట్టొద్దే. అలాగని మాట ఇస్తేనే మీకు చెప్తాం. ఆ... అంతా ఒకే అన్నారు కాబట్టి మొదలెట్టేస్తున్నాం. జాగ్రత్తగా చదివి చేసెయ్యండే.

ప్లేట్ పపెట్ చెయ్యడానికి ఏమేం కావాలంటే.... గ్లోవ్స్ (చేతి తొడుగులు), గమ్, పేపర్ ప్లేట్లు, రంగురంగుల కాగితాలు, స్కెచ్ పెన్నులు.

ఎలా చేయాలంటే... ముందు చేతి తొడుగును తీసుకుని పేపర్ ప్లేట్ వెనుక అతికించండి. ఇప్పడు మీరు ప్లేటు మీద ఏ జంతువు బొమ్మ వెయ్యాలనుకుంటున్నారో నిర్ణయించుకోండి. తర్వాత పేపర్ ప్లేటును ముందుకు తిప్పండి. ప్లేట్ మధ్యలో ఆ జంతువు కళ్లు, ముక్కు, నోరు గియ్యండి. ఇహ రంగు కాగితాలను సన్నటి పీచుల్లా కత్తిరించుకొని సిద్ధం చేసుకోండి. తర్వాత పేపర్ ప్లేటు అంచున ఒక అంగుళం ఖాళీ వుంచి సర్కిల్ గియ్యండి. అక్కడ ఆ కాగితాలను కొద్దికొద్దిగా ఖాళీ వదులుతూ అతికించండి. గమ్ ఆరే వరకు దీన్ని అలా వుంచండి. తర్వాత ఎంచక్కా బొమ్మలో బాబులా గ్లోవ్‌ను చేతికి తగిలించుకుని ఆడుకోవచ్చు. ఎవరినైనా దడిపించొచ్చు.

బావుందికదూ ప్లేట్ పపెట్. మరి ఎందుకంట ఆలస్యం? ○

చుక్కలు కలిపితే...





ఎలా చేరాలో ఏంటో!

చిన్నారులూ... బొమ్మలో పైన ఓ చుంచు వుందికదా. దాని ఆహారం మాత్రం గజిబిజి దారుల కింద ఎక్కడో వుంది. దాన్ని చేరాలంటే ఎలాగబ్బా!

అవి ఎక్కడున్నాయి?

హేయ్ చిన్నారులూ.. కింద ఏవో కొన్ని చెట్లు దట్టంగా వున్నట్టున్నాయికదా. కానీ వాటి మధ్యలోనే ఎనిమిది ప్రాణులున్నాయి. మీకు బాగా తెలిసిన, టీవీల్లో, పుస్తకాల్లో చూసిన జంతువులు కూడా వాటిలో వున్నాయి. మరి వాటిని గుర్తించి సున్నా చుట్టండే.

రంగులు పులిమేద్దాం



చిన్నారి చిత్రకారులు

బుజ్జాయిలూ... ఈ నేస్తాల్లా మీకూ చక్కటి బొమ్మలేసి పంపాలని వుందా. మీ పేరును కూడా ఇలా పుస్తకంలో చూసుకోవాలని వుందా! అయితే వెంటనే పోస్ట్ కార్డుమీద చక్కటి బొమ్మ వేసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: **చిన్నారి చిత్రకారులు,** ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాద్.



యు.భవాని, (తరగతి రాయలేదు),
ఎం.పి.యు.పి.స్కూల్, పుట్టగుంట.



వలేటి దావీదురాజు, 9వ తరగతి,
బి.ఎస్.ఎం.జడ్.పి.హెచ్ స్కూల్, కొత్తపట్నం.

అట్టమీది కథ





వి. నాగరత్న

శిశువుల్నీ, పశువుల్నీ అలరించేది సంగీతం. అందుకే మాటలు మర్చిపోతాంగానీ పాటలు మరువలేం. కలల్లో తేలితే పాట, కల్లోలం రేగితే పాట, కోపమొస్తే పాట, మనసు నొచ్చుకుంటే పాట, సరదాగా షికారుకెళ్తే పాట, ఏదీ లేక వైరాగ్యంలో మునితేలితే పాట. మొత్తానికి సంతోషం ఉప్పొంగినా, శోకం మనల్ని ముంచేసినా చక్కగా అభివ్యక్తీకరించేది పాటే. దాని విశిష్టత అలాంటిది. ఏదో సందర్భంలో వింటోన్న పాటతో తాదాత్మ్యంచెందడం మనందరికీ సర్వసాధారణం. సాహిత్యం బాగుండి, సంగీతం పండితే అది నాలుక్కాలాలపాటు నిలిచిపోయి, నలుగురి నోళ్లలో నానుతుంది. సంగీతసాహిత్యాల్లో ఒకటి కుదరకపోయినా పాటకు భవిష్యత్తు వుండదు. అంటే క్లాసు లేదా మాస్‌కు నచ్చేవిధంగా వుండే పాటలు ఆకాశవీధుల్లో తేలియాడితే ఏ కోవకూ చెందని పాటల్ని విని ఆనందిస్తూనే "ఆ.. నిజజీవితంలో లేనివి సినిమాల్లో ఎందుకు చూపడం? ఒకరిమీద ప్రేమ కలగ్గానే పార్కులకెళ్లి 'ఏటో వెళ్లిపోయింది మనసు.. ఇలా మిగిలిపోయింది వయసు..' అంటూ ప్రేమాలాపనలు చేస్తారా ఎక్కడైనా? ఏదైనా ఆపద రాగానే దేవుడిముందు కూర్చుని 'ఉన్నావా, అసలున్నావా / వుంటే కళ్లు మూసుకున్నావా..' అని దేవుణ్ణి తిడతారా?' - అనేవారు అసంఖ్యాకం. ఇది సద్విమర్శే. ఇందులో రవంత అతిశయోక్తి లేదు. అయితే జీవితాల్ని రియలిస్టిగ్గా చూడాలనుకుంటే లేదా కనీసం వాస్తవాలకు దగ్గరగా చూడాలనుకుంటే ఆర్టు సినిమాలు చూడాలి. అంతేతప్ప కమర్షియల్ సినిమాల్లో అవేమీ ఆశించలేం. ఇవి దాదాపు తూకాలు, కొలతలతో చిత్రీకరిస్తారని మనందరికీ తెలుసు. సుమారు 180 నిమిషాల నిడివిగల సినిమాలో 6 పాటలు, 3 ఫైట్లు తప్పనిసరి. అంటే

మనసున మల్లెలు కురిపించే చిత్రగీతాలు

తక్కిన పాటలు అథఃపాతాళంలో పడిపోతాయి.

అయితే సినిమా పాటలమీద ఒక్కొక్కరికీ ఒక్కో అభిప్రాయం వుంటుంది. పాటలూ, ఫైట్లూ లేకపోతే అదేం సినిమా అనేవాళ్లున్నారు. సినిమా చూసినా చూడకున్నా పాటల కేసెట్లు కొనుక్కుని వినేవారు అసంఖ్యాకం. టీవీ కార్యక్రమాలు సగానికి పైగా సినిమా పాటల ఆధారంగానే రూపొందిస్తారు. మాటకంటే పాట బలమైందని అందరూ ఒప్పుకుంటారు. కొందరు బాగున్న అరగంటకో పాట వచ్చేవిధంగా కథను మలచుకుంటారు. (వేరువేరు ఛానళ్లలో ప్రసారమౌతున్న సినిమాలను మార్చి చూస్తే సర్వసామాన్యంగా అన్నిట్లో ఒకేసారి పాట వస్తుంది) పాటలు జనాదరణకు నోచుకుంటాయి గనుక వాటిని విస్మరించరు. గొప్ప అభిరుచి వున్న దర్శకనిర్మాతలు సైతం పాటలను చక్కగా మలచాలనుకుంటారే తప్ప వద్దనుకోరు. ఏ ఒకరిద్దరో పాటల్లేకుండా ప్రయోగాత్మకంగా అలాంటి చిత్రాలు తీసినా విజయం సాధించక కోట్ల నష్టం తెచ్చిన ఘట్టాలే ఎదురైనందున దాన్ని

గుణపాఠంగా తీసుకుని అందుకు సిద్ధపడరు.

పాటల గురించి వాదవివాదాల సంగతలా వుంచి నాణ్యత, చిత్రీకరణల విషయం మాట్లాడుకుందాం. రెండర్థాల లేదా వెకిలితనాన్ని గుప్పించే చౌకబారు పాటలు, చెవుల్లో రొదపెట్టే డబ్బాలో రాళ్ల పాటలు, కాపీ ట్యూన్లు, రవంత కొత్తదనంలేని దంపుడు పాటలు, శరీరంమీద తేళ్లూజెర్రులూ పాకుతున్నట్లు గగుర్పాటు భావాన్ని కలిగించే భయంకర గీతాలు - ఇలా అనేకం వున్నాయి. వీటన్నింటితోబాటు మనసున మల్లెలు పూయించే, మదిలో వీణలు మోగించే, మనచుట్టూ సుగంధాలు వెదజల్లే, మనసును కదిలించే, మేథకు పదునుపెట్టే, కలకాలం నిలిచే, కలల్లో విహరింపజేసే అపురూప మధురగీతాలు కూడా లెక్కకు మిక్కిలిగానే వున్నాయి.

ఒక పాటలో అనేకమంది కళాకారుల నైపుణ్యం ఇమిడివుంటుంది. ఒక కవి రాయడంతో పాట ఆవిర్భవిస్తుంది. అది గాయనీగాయకుల గళంలో సమ్మోహనస్వరాన్ని కల్పించుకుంటుంది. సంగీత దర్శకుడు అనువైన ట్యూన్నందించగా, వివిధ వాయిద్యకారులు ఆర్కెస్ట్రా సమకూర్చి నిండుతనాన్నిస్తారు. ఇవన్నీ ఒక ఎత్తయితే దానికి దృశ్యరూపమివ్వడం మరో ఎత్తు. నటీనటులు, నృత్యదర్శకుడు, చిత్రదర్శకుడు - వీరందరి కూర్పులో, సమిష్టి కృషితో సినిమాపాటగా అవతరిస్తుంది.

చాలామంది పాతపాటలనే ఎక్కువగా ఇష్టపడతారు. అప్పటి సంగీతసాహిత్యాలు వినసొంపుగా వుండటం, నటీనటుల అభినయంలో చౌకబారుతనం లేకుండా ఒక హుందాతనం చోటుచేసుకోవడమే అందుక్కారణం. అలాని పాతవన్నీ ఆణిముత్యాలనలేం. ఈకాలంలో కూడా మంచిపాటలు వస్తూనే వున్నాయి. అయితే సంఖ్యలో స్వల్పం. పూర్వం రాశి కంటే వాసిపైన దృష్టి నిలిపేవారు. ఇప్పుడు 'టైమీజ్ మనీ' కనుక కవి దగ్గర్నుంచి మేకప్ ఆర్టిస్టు వరకూ ఏ ఒక్కరూ కూడా పెద్దగా కాలాన్ని వెచ్చించేందుకు సంసిద్ధంగాలేరు. శ్రమ, సమయం తగ్గి, రాబడి, కీర్తి దండిగా వుండాలనే కోరిక ఈ తరం రక్తంలోనే ప్రవహిస్తోందంటే అతిశయోక్తి కాదు.

ప్రకృతి ఎంత అందమైనది?! అందులో ఎన్ని వింతలు విడ్డూరాలు, ఎన్ని ఆకర్షణలు అద్భుతాలు?! వంపులు సొంపులు, పూవులు పిట్టలు, కొండలు లోయలు - అన్నీ తమ సొగసులతో సోయగాలు చిందిస్తుంటాయి. ఈ సౌందర్యాలకు తలమానికం ఆకాశంలో మేఘాలు అలవోకగా పయనించడం, అవి భూమ్మీద వర్షించడం.

సరదాగా, చిలిపిగా చారెడు నీళ్లు చిలకరిస్తేనే చూడముచ్చటగా వుంటుంది. ఇక అనంతమైన ఆకాశంలోంచి అలా నీళ్లు జాలువారుతుంటే మరెంత శోభాయమానంగా వుంటుందో చెప్పడానికి భాష చాలదు. చిరుజల్లయితే జాజిపూలు రాలుతున్నట్లుంటుంది. జోరున కురిసే జడివానయితే వరుణుడు వజ్రాలపొడి వెదజల్లుతున్నట్లుంటుంది.

అజంతా శిల్పాల అందాలనో, జయపూర్ కట్టడాల నైపుణ్యాన్నో, త్రివేణీసంగమాన్నో, కులూమనాలీ సోయగాలనో చూడాలంటే ఎన్నో సమకూర్చుకోవాలి. కానీ ఆకాశవీధుల్లో యదేచ్ఛగా విహరించే మేఘమాలికలను చూసేందుకు ఎవరికీ ఎలాంటి మూల్యమూ చెల్లించనవసరంలేదు. అనుభూతిచెందే మనసుంటే చాలు - వెన్నముద్దల్లా, దూదిపింజల్లా, నీలిపొగల్లా వుండే మబ్బుల మాయాజాలాన్ని హాయిగా వీక్షించవచ్చు.

మబ్బులు, వానలు వేటికవే అందాలు చిందిస్తూ ఆనందాల ముంచెత్తుతాయి. అటువంటి సుందరదృశ్యాలమీద మన కవులు ఎన్నో మధురగీతాలు రాశారు. ప్రేక్షకులకు కనువిందు చేయడమే లక్ష్యంగా భావించే దర్శకులు వాటిని చక్కగా చిత్రీకరించి వెండితెరకెక్కించారు. ఆ పాటలు చిరస్థాయిగా నిలుస్తాయి. అందుక్కారణం అవి మనల్ని ఆకట్టుకుని మనసుల్లో నిలిచిపోయేట్లు వుండటమే. అలాంటి సుమధురగీతాలను ఒకసారి గుర్తుచేసుకుందాం. ఆనందాల అంచులను తాకివద్దాం.

ఒక ప్రేమికుడు మేఘాల సొగసును అల్లంతదూరం నుండి చూసి తృప్తిచెందక 'ఓహో మేఘమాలా, నీలాల మేఘమాలా / చల్లగా రావేల, మెల్లగ రావేల..' అంటూ వాటిని తన చెంతకు రమ్మని ఆహ్వానిస్తాడు. ప్రేయసికి ఎక్కడ నిద్రాభంగం అవుతుందోనని ఉరిమినా, మెరిసినా ఊరుకోనంటాడు. మరో సందర్భంలో 'మేఘంలా వచ్చిందీ హాయ్ హైలెస్సా / నవరాగంలా వచ్చిందీ మోనాలీసా..' అని ఆలపించగా మరో చెలికాడు తన ప్రియురాలితో కలసి షికారుచేస్తూ 'మేఘాలలో తేలిపొమ్మన్నదీ / తూఫానులా సాగిపొమ్మన్నదీ..' అంటూ సంబరాల అంబరంలో తేలిపోతాడు. ఒక యువతి తన బావ తనకు దూరమయ్యాడన్న దుఃఖాతిశయంలో 'గగనసీమల తేలు ఓ మేఘమాలా / నా వలపు బావకు చెప్పిపోవా..' అని ఆర్ద్రంగా వేడుకుంటుంది. ఒక యువకుడు విరహంలో 'ఆకాశమార్గాన ఆషాఢ మాసాన / మెరిసేటి ఓ మేఘమా..' అని ఆలపిస్తూ కన్నీళ్లతో మేఘసందేశం పంపుకున్నాడు. అద్వితీయమైన అందాలను తనివితీరా వీక్షించే వీలు, మనసులో మాట మనవిచేసుకునే వ్యవధి లేకుండా ఏ దూరప్రాంతాలకో తరలిపోతున్న మబ్బులనుద్దేశించి ఒక కవి 'నీలిమేఘమా, జాలి చూపుమా / ఒక్క నిమిషమాగుమా..' అని బ్రతిమాలుతూ తన చెలికి సందేశం అందించాడు. ఒక చెలికాడు తన మనోహారిణి గురించి 'నీలిమేఘాలలో, గాలి కెరటాలలో / నీవు పాడే పాట, వినిపించునేవేళ..' అని గానం చేశాడు. నీలిమబ్బుల మధ్య గాలిసవ్వడిలో చెలిపాట వినగల్గడంకన్నా గొప్ప ఊహ ఇంకేముంటుంది? ఒక అల్లరి యువకుడు '..మేడెక్కి దిగదురా మేఘమాల..' అంటూ మురిపించి, మైమరపించి, చిక్కకుండా, దొరక్కుండా తమాషాచేసే మేఘాలవరుసతో తనకు నచ్చిన అమ్మాయిని పోల్చడం ఎంత కమనీయం?! పోతే ఒక నాయిక 'మబ్బులో ఏముంది, నా మనసులో ఏముంది?' అని సవాల్ చేస్తుంది. నిజానికి అడిగినంత తేలిక్కాదు జవాబు చెప్పడం. చూడముచ్చటైన దూదిపింజల్లాంటి మబ్బులు ఎలా ఏర్పడ్డాయో, అందులో ఏముంటుందో మనకు తెలీదు. తెలుసుకుంటే ఆ అందమూ వుండదు. మనసూ అంతే. అందులోని మర్మాలు అర్థంకావు.

ఆకాశం నీలంగా వుంటుంది కనుక పురాణపురుషులైన రామకృష్ణులను అనంతత్వానికి చిహ్నంగా నీలిరంగులో సృష్టించారంటారు. మన కవులు మేఘాలలో తేలిపోతూ వుండిపోలేదు. ఆ మబ్బు తునకల నుండి జాలువారే వర్షధారల్లోనూ తడిసి తరించారు. ఇక ఆ మబ్బులే మంచిముత్యాలాంటి బిందువులను రాలిస్తే ఆ సోయగాన్ని చూడాల్సిందే, అనుభూతి చెందాల్సిందే. ఓ చారిత్రక నేపథ్యంతో పాట రాయాలంటే, ఒక స్వభావాన్ని చిత్రిస్తూ పద్యం అల్లాలంటే కష్టపడాలి,



కసరత్తు చేయాలి. కానీ మనసు దోచే వానజల్లులను అలవోకగా పాటలుగా మలచవచ్చు. అందుకే అలా వర్షంపై అల్లిన పాటలు అసంఖ్యాకంగా వచ్చాయి.

'చినుకు చినుకు సందడిలో / చిటపటమను సవ్వడిలో..', 'చిటుక్కు చిటుక్కు చినుకంట / చురుక్కు చురుక్కు మందంట..' ఇలా వర్షపాత శబ్దాన్ని, అందులోని లయను వర్ణించిన పాటలున్నాయి. 'స్వాతీముత్యపు జల్లులలో / శ్రావణమేఘపు జావళిలో..' అని పరవశంగా యుగళగీతాలు పాడుకోవడం కద్దు. చిలిపితనం ఒళ్లంతా ప్రవహించే ఒకమ్మాయి వర్షంలో తడుస్తూ, ఎగిరి గంతులేస్తూ 'జల్లంత కవ్వింత కావాలిలే / ఒళ్లంత తుళ్లింత రావాలిలే..' అని పాడుతుంటే చూస్తోన్న ప్రేక్షకులక్కూడా ఉత్సాహం పొంగుకొచ్చి నాట్యం చేయాలనిపిస్తుంది. ఆ జాతికే చెందిన కొందరు అమ్మాయిలు వానలో తడుస్తూ 'కురిసే పూలగాలికి / చినుకే పాట పాడెనే..' అంటూ జోరుగా, హుషారుగా పాట పాడ్తారు.

ఏటా శ్రీరామనవమి, వినాయక చవితి పర్వదినాల్లో కొన్ని చినుకులైనా విధిగా పడ్తాయి. అక్షతలకు బదులుగా అలా చినుకులు రాల్తాయంటారు. అదెంత నిజమోగానీ హోలీరోజున కూడా వాన పడుతుంది. వర్షంలో హోలీ ఆడుతూ 'సందెపొద్దు మేఘం, పూలజల్లు కురిసెను నేడు / చల్లనైన మనసులు ఆడిపాడుతున్నవి చూడు..' అంటూ కొందరు కేరింతలతో, తుళ్లింతలతో పాడుకున్నారు. కేవలం వర్షాన్ని ఆస్వాదించడం కంటే ఆ వానకు తోడు తనకు నచ్చి, తనను మెచ్చినవాడు వుండాలని ఆశిస్తూ 'చిటపట చినుకులు పడుతూ వుంటే / చెలికాడే సరసన వుంటే..' అని పాడ్తుంది ఓ వనిత. అప్పుడే సిసలైన పరవశం.

అలా వసారాలో కూర్చుని వాకిట్లో వున్న చెట్లు, పూలమొక్కలమీద పడ్తోన్న వర్షాన్ని తిలకిస్తే ఎంత రమ్యంగా, ముగ్ధమనోహరంగా వుంటుందో మాటల్లో చెప్పలేం. అలా కురుస్తున్న వానను చూస్తూ ఓ అమ్మాయి కలల్లోకి వెళ్లిపోయి 'ముత్యాలజల్లు కురిసె / రతనాల మెరుపు మెరిసె..' అని పాడుకుంటుంది. ఇంత అందమైన వర్షం వికటిస్తే వాగులూవంకలూ వరదలై పొంగుతాయి. చేతికొచ్చిన చెట్టూచేమా, పొలమూపంటా కొట్టుకుపోయి మన పొట్టలు మాడుస్తాయి. మానవాళికి సర్వసంపదలూ ఇచ్చే ప్రకృతే ఒక్కోసారి వికృతరూపం దాల్చి విలయతాండవం చేసి ఇళ్లూవాకిళ్లూ, గొడ్డూగోదతో సహా మన ప్రాణాలూ బలికొంటుంది. అలాంటి సందర్భంలో ఒక కవి రాసిన పాట 'ఏలమ్మ ఈ వర్షధార / లోకమే నిండి కల్లోలమైపోయె / కన్నీరే పొంగెనో / మిన్నేరే పొంగెనో..' – ఇలా ఎంతో ఆర్ద్రంగా, హృదయానికి హత్తుకునే సమ్మోహన సంగీతంతో సాగుతుంది. ఇలాంటి అవాంఛనీయమైన ఉప్పెనలను పక్కనపెడితే వర్షపాతాన్ని ఇష్టపడనివారుండరు.

కొన్ని పరిస్థితులు, స్వభావాలు దేశకాలాలతో సంబంధం లేకుండా ఎప్పుడయినా, ఎక్కడయినా ఒకేరకంగా వుంటాయి. పాత పాటలను గుర్తుచేసుకుంటే ఎన్నెన్నో మదిలో మెదుల్తాయి. మచ్చుకు కొన్ని చూద్దాం.

'ధరణికి గిరి భారమా, గిరికి తరువు భారమా, తరువుకు కాయ భారమా, కనిపెంచిన తల్లికి పిల్ల భారమా..' ఎంత గొప్ప పాట?! ఎంత అర్థవంతమైన భావమో, అంత రక్తి కట్టించే సంగీతం. అలాగే 'సడిచేయకో గాలి సడిచేయబోకే, బడలి ఒడిలో రాజు నిదురించెనే..' ఇందులో చెలికాడు బడలికతో నిద్రిస్తున్నాడని, శబ్దంచేసి విసిగించావంటే ఊరుకోనని గాలినే మందలిస్తోన్న ఒక యువతి. హాయిగొల్పుతూనే పెదాలమీదికి సన్నటి నవ్వు తెప్పించడంలేదూ?! 'సిరిమల్లె వెలయెంత, మరుమల్లె పూవంత/ మరుమల్లె వెలయెంత, సిరులేవీ కొనలేనంత..' అనే పాటను పైపైన చూస్తే సాదాసీదాగా వుంటుంది. కానీ కొన్నిటికి వెలకట్టలేమన్న సంగతిని ఎంత హృద్యంగా చెప్పారో కదా?! 'రామచక్కని బంగారు చిలుకా..', 'అనగనగా ఒక రాజు, అనగనగా ఒక రాణి..', 'ఉందిలే మంచికాలం ముందూముందూనా/ అందరూ సుఖపడాలి నందనందనా..', 'సాగరతీర సమీపాన/ చెరుగని కావ్య సుధామధురం..', 'నా నోట నీ పాట పలకాలె చిలుక..' మొదలైన పాటల్లో సాహిత్యం కంటే కూడా సంగీతం అద్భుతంగా తోస్తుంది. 'ముద్దబంతి పూవులో మూగకళ్ళ సొగసులో..', 'మనసున మల్లెల మాలలూగెనే..', 'ఎన్నెన్నో జన్మల బంధం.. నీదీ నాదీ..', 'పలుకే బంగారమాయెనా..', 'పాదమని నన్నడుగవలెనా..', 'నీవు లేక వీణ/ పలుకలేనన్నది..', 'కళ్ళలో ఉన్నదేదో కన్నులకే తెలుసు..' – ఇలాంటి పాటలు ఎక్కడికో తీసికెళ్తాయి. కన్నెపిల్లల్నే కాదు వృద్ధనారీమణులను కూడా బోసినవ్వులు నవ్వేలా చేస్తాయంటే అతిశయోక్తి కాదు.

'ప్రతీ రాత్రి వసంతరాత్రి/ ప్రతిగాలి పైరగాలి..', 'ఇది మల్లెల వేళయని/ ఇది వెన్నెల మాసమని..' వంటి మధురగీతాలు కృష్ణశాస్త్రి సిరాగుర్తులు. 'మనసు గతి ఇంతే/ మనిషి బ్రతుకింతే..', 'మనసు లేని బ్రతుకొక నరకం..' లాంటి పాటలకు కోకొల్లలుగా పుట్టుకొచ్చాయి. మనసును మైనపుముద్దగా మలచి ఎలాగంటే అలా చెక్కడం ఆత్రేయగారికే చెల్లింది. 'కన్ను మూసింది లేదు, నిన్ను మరిచింది లేదు/ హేమంతమేగె, చామంతి పూసె ఈ వేళ/ జాలి లేదేల, ఇకనైన రావేల..' – దాశరథి కలంనుండి జాలువారిన గానామృతమిది. 'ఊహలు గుసగుసలాడె/ నా హృదయము ఊగిసలాడె..', 'నన్ను దోచుకుందువటె వన్నెల దొరసాని..' మొదలైన పాటలు సినారె ప్రతిభకు గీటురాళ్ళు. 'సిగలోకి విరులిచ్చి/ చెలినొసట తిలకమిడి..', 'కృషి వుంటే మనుషులు రుషులౌతారు..', 'చదువు రానివాడవని దిగులు చెందకు..', 'నా చేయీ, నీ చేయీ పెనవేసి బాసచెయ్యి..', 'ఊరు మారినా ఉనికి మారునా..', 'జననీ జన్మభూమిశ్చ/ స్వర్గాదపీ గరీయసి..' తరహా పాటలు పరవశాన్ని కలిగిస్తూనే సందేశాన్ని, స్ఫూర్తిని ఇస్తున్నాయి. ఊరట కలిగించి, ఓదార్చేలా వున్నాయి. 'పదిమందిలో పాట పాడినా/ అది అంకితమెవరో ఒకరికే..', 'నీవేనా నను పిలిచినది..', 'ఓ బాటసారి/ నను మరువకోయి..' మొదలైన పాటలు ప్రేమికుల అలజడికి అక్షరరూపాలు.

తెలుగు సినిమా పాటల్లో మనసూమమతలే కాదు 'సరదా సరదా సిగరెట్టు..', 'ఆకాశంనుండీ/ నాకోసం వచ్చావా..', 'వినరా సూరమ్మ కూతురి మొగుడా/ అసలు విషయము చెప్తాను..', 'తాళి కట్టు శుభవేళ..', 'కాశీకి పోయాను రామాహరీ..' తరహా హాస్యగీతాలూ అనేకం ఉన్నాయి. అవి సంగీత, సాహిత్యపరంగానే కాక దృశ్యీకరణ రీత్యా కూడా రక్తి కట్టించడం విశేషం. ఓల్డీజ్ గోల్డని, కొత్తది వింత, పాతది రోత – అని ముద్రలేసేయడం సముచితం కాకపోయినప్పటికీ అలనాటి పాటలే ఎక్కువశాతం మధురిమలొలికించిన మాట వాస్తవం. కానీ అప్పటి పాటల్లోనూ 'మేనులో ఏముంది..' టైపు విసిగించే పాటల్లేకపోలేదు. అలాగే వెస్ట్రన్ మ్యూజిక్ ప్రభావంతో హోరెత్తుతూ ఇప్పటి పిచ్చెక్కించే పాటలతోబాటు అడపాదడపా కొన్ని మధురగీతాలు రాలుతున్నాయి. అలాంటివాటిలో 'నిను చూడక నేనుండలేను..', 'ఓ చెలియా/ నా ప్రియసఖియా/ చెయిజారెను నా మనసె..', 'మా ఊళ్ళో నీళ్ళకు కరువు/ నే తెచ్చా బిందెడు అరువు/ చేసేద్దాం స్నానం కలిసి..', 'హృదయం ఎక్కడున్నది..' – ఇలాంటి పాటలు అందుకు మచ్చుతునకలు. ఇలాంటి మంచి పాటలు అసంఖ్యాకంగానే వున్నాయి.

మంచి పాట మురిపిస్తుంది, మై మరపిస్తుంది. ఆకాశవీధుల్లో విహరింపజేసి మన ఉనికే మనకు గుర్తులేకుండా చేస్తుంది. పాటకు అంత పవరుంది కనుకనే 'శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి.. గానం ఫణి..' అన్నారు. అలాంటి శక్తివంతమైన గానానికి దృశ్యం తోడైతే బంగారానికి తావి అబ్బినట్లే. మరి ఆకర్షణీయమైన ప్రకృతి దృశ్యాలకు, భిన్న పరిస్థితులు, స్వభావాలకు అక్షరరూపమిచ్చి పాటలుగా రాసిన, చిత్రించిన కవులు, దర్శకులను ఎంత పొగిడినా తక్కువే కదూ?!

*

ఆరోగ్యం

వేదగిరి రాంబాబు

ఒప్పించడం ముఖ్యం

కులమూ, మతమూ లాంటి బేధాలన్నీ మనం సృష్టించుకున్నవే. అందరికీ ఆకలేస్తుంది, బాధ కలుగుతుంది, సంతోషం కలుగుతుంది. అందరిలోనూ ప్రవహించేది ఒకే తరహా రక్తం. అందరిరక్తం కూడా ఎర్రగానే ఉంటుంది. అటువంటప్పుడు మనలో ఈ బేధాలేంటి? అంటుంటారు చాలామంది. ఇది గొప్ప నిజం.

రక్తమే కాదు అందరిలోనూ ఒకే రకమైన అవయవాలూ ఉంటాయి. అవి ఒకే విధమైన నిర్మాణంతో ఉంటాయి. అందుకే ఒకరి అవయవం పూర్తిగా పాడై చనిపోతారనుకున్నప్పుడు– చనిపోవడానికి సిద్ధంగా ఉన్న మరోవ్యక్తి అవయవాన్ని దానంగా స్వీకరించి శస్త్రచికిత్స ద్వారా మార్పిడి చేస్తారు.

రాష్ట్రాలేకాదు, దేశాలకతీతంగా కూడా ఈ అవయవమార్పిడి జరుగుతూ ఉంటుంది. అంటే రాష్ట్రం, దేశం లాంటి బేధాలకు అర్థంలేదనేగా...?

అలాగే ఆర్థిక, సామాజిక అసమానతలు ఎటువంటి అడ్డంకులూ కావని ఈ అవయవమార్పిడి శస్త్రచికిత్సలు మనకు చెబుతున్నాయి. అయితే ఈ అవయవమార్పిడి గురించి ఎన్ని విషయాలు మనకు ఎంతవరకూ తెలుసు?!

ఈ దానం మనలోని మానవత్వాన్ని జాగరూకం చేస్తుంది. మూఢనమ్మకాలను పారద్రోలుతుంది. మన కర్తవ్యాన్ని మనకి బోధిస్తుంది. అవయవాలు పూర్తిగా దెబ్బతిని మరణానికి అతి సన్నిహితంగా ఆర్గాన్ వెయిటింగ్‌లిస్ట్‌లో ఉన్నవాళ్ల దయనీయగాథలు మనం తెలుసుకునేట్లు చూస్తుంది. వెయిటింగ్‌లిస్ట్‌లో ఉన్నవాళ్లు వేలల్లో ఉంటే దానం చేసేవాళ్లు పదులలో కూడా లేరనే నిజం మనకి అర్థమవుతుంది.

మన ఆర్గాన్స్‌ని మరణానంతరం దానం చేయడానికి ఎంతగానో ఆలోచిస్తాం. ఇవాళ మనం డోనార్ అనుకుంటాం. రేపు రిసీపెంటయితే?! ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదుగా...! అందరూ మనలాగే అవయవదానానికి అంగీకరించకపోతే బాధ పడేవాళ్లలో మనమూ ఉంటాంగా?! అందరూ అవయవదానం చేసేందుకు సిద్ధపడినట్లయితే ఎప్పుడు, ఎవరికి ఏ అవయవం కావాల్సివచ్చినా లభ్యమవుతుంది. విదేశాలతో పోల్చితే మనం ఈ అవయవదానంలో ఎంతో వెనుకబడి ఉన్నాం. వెనుకబడిన విషయాల్ని కాసేపు పక్కనబెట్టి ముందున్న విషయాలను ఆలోచిద్దాం.

శివరాంపల్లి పోలీస్ అకాడమీలో రాజమౌళి పొన్నుజు టీ తయారుచేసి అమ్ముతుండేవాడు.

2004 నవంబరు 25 రాత్రి ఓ లారీ వేగంగా దూసుకొచ్చి అతడిని గుద్దింది. వెంటనే అతన్ని మెడ్విన్ హాస్పటల్‌లో చేర్పించి చికిత్స జరిపారు. దురదృష్టవశాత్తూ అతడు కోలుకోలేదు. ఆరోగ్యం క్రమంగా క్షీణించసాగింది. మరుసటిరోజు అంటే 26న అతను బ్రెయిన్‌డెత్ చెందినట్లుగా డాక్టర్లు నిర్ధారించారు.

అతనెలాగూ మరణిస్తాడు. అవయవాల్ని కూడా కాయంతో ఎందుకు కాలబెడతావ్? ఆ అవయవాల్ని దానం చేస్తే ప్రాణాపాయంలో ఉన్న కొందరికి ప్రాణదానం చేసినట్లవుతుందని భార్యకి కౌన్సిలింగ్ చేశారు. ఆమె పరిస్థితిని ఆకళింపుచేసుకోగలిగింది. అందుకే బ్రెయిన్‌డెత్ అయిఉన్న భర్త అవయవాల్ని అవసరంలో ఉన్నవాళ్లకు దానం చేయడానికి అంత బాధలోనూ అంగీకరించింది.

మెడ్విన్‌లోనే శస్త్రచికిత్స జరిపి రాజ్‌మౌళి అవయవాల్ని వెలికితీశారు. కాలేయం, మూత్రపిండాలు, కళ్లు దానం చేశాడు. అవి ఐదుగురికి కొత్త జీవితాన్నిచ్చాయి.

ఇక్కడ మనం ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. డొనేషన్ ఇవ్వాలని నిశ్చయించుకున్నంతలో సరిపోదు. ఈ విషయం తమ వాళ్లవారందరికీ తెలియజేయాలి. అంగీకరింపజేయాలి. అప్పుడే ఆ వ్యక్తి కోరుకున్నట్టు అవయవదానం జరుగుతుంది. *

అవయవదానంగురించి అందరికీ చిన్నప్పటినుంచే తెలియాలి. కాయంతోపాటు కళ్ళే కాదు, మరికొన్ని అవయవాలూ నాశనం కాకూడదు. అవి తనతో చనిపోకుండా బ్రతికుండి మరికొంతమందిని బ్రతికించగలవు. ఈ భావం చిన్నతనంలోనే మనసులో నాటుకుపోయుంటే అవయవదానానికి ఎవరికి వాళ్ళు ముందుకువస్తారు. అలాగే తమవాళ్ళకి ఏ కారణంచేతనైనా బ్రెయిన్‌డెత్ అయితే దగ్గరి బంధువులు అవయవదానం చేసేందుకు ముందుకొస్తారు.

ఓ మనిషి కెడావర్‌డెత్ చెందినప్పుడు ఒకపక్క దగ్గరివాళ్ళు తీవ్ర మనోవేదనలో వుంటే దానంగురించి అప్పుడు చెబితే సరిగా మనసుకెక్కించుకోలేరు. ప్రతి ఒక్కరికీ చిన్నప్పటినుంచి అవయవదాన ప్రాధాన్యత తెలిసుండేలా చేయాలి. బ్రెయిన్‌డెత్ జరిగిన తర్వాత ఆత్మీయులు వెళ్ళిపోతున్నారన్న బాధలోనూ అవయవదానానికి అంగీకరిస్తోన్న పెద్దమనసున్నవాళ్ళకు శతకోటి

కథ

సమీర్ చక్రవర్తి

ఎందుకు చెయ్యకూడదు..?

"చూడు నీమూలంగా ఇప్పుడెంత నష్టమో?! సంవత్సరం కిందటే చెప్పా. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఒకరిని పెట్టుకుందామని. ఎగ్జిక్యూటివ్ ఉండుంటే నాకు శ్రమా తగ్గేది. ఇలాంటి సమయంలో సరిగ్గా ఉపయోగపడేవాడు. అదనపు ఖర్చంటూ నా మాట పడనివ్వలేదు నువ్వు" అంటూ ఇంట్లోకొస్తూనే శ్రీధర్ భార్యపై కోపాన్ని ప్రదర్శించాడు.

"నేను మాత్రం ఊహించానా యాక్సిడెంట్‌లో మీ కాలు విరుగుతుందని?" అని సమాధానమిచ్చింది శ్రీధర్ భార్య రవళి.

"మాటకుమాట చెప్పకు. ఈ యాడ్ ఏజెన్సీని ఇంతస్థాయికి చేర్చడానికి ఎంత కష్టపడ్డానో తెలుసా? రేయింబగళ్లు యాడ్, యాడ్ అంటూ సిటీలో నేనెక్కని ఆఫీస్‌గుమ్మం లేదు" అని పెద్దగొంతుకతో భార్యపై విరుచుకుపడ్డాడు శ్రీధర్.

"కష్టపడ్డారు ఒప్పుకుంటాను. మీకష్టం నాకు తెలీందికాదు. మన పెళ్లైన తర్వాతే కదా బిజినెస్ ప్రారంభించారు. అదీ మావాళ్లిచ్చిన కట్నం డబ్బుతో. నావంతు సాయం నేను చేస్తూనే ఉన్నాను. మీరు కొంచెం స్థిమితంగా ఆలోచించండి. పరిష్కారమదే దొరుకుతుంది. ఇప్పుడు కొంప మునిగిపోయిందేంలేదు" అంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేసింది రవళి.

ఆమె మాటలు అతనికి పుండుపై కారం జల్లినట్లుగా తోచాయి.

"ఏం మాట్లాడుతున్నావు, బోడి కట్నం. నలభైవేలిచ్చారు. ఇప్పుడు నా బిజినెస్ టర్నోవర్ 15 లక్షలు. కావాలంటే విసిరికొడతా నలభై వేలు. అదిసరే ఇప్పుడు కొంపలు మునిగిపోతున్నాయా లేదా? డాక్టర్లు నన్ను నెలరోజులపాటు కాలుకింద పెట్టొద్దన్నారు. నెలరోజులు పని మానేస్తే పబ్లిక్ రిలేషన్స్ దెబ్బతింటాయి. ఆర్డర్లు రావు. ఏజెన్సీ రిప్యుటేషన్ పడిపోతుంది. ఇంత పెద్దనష్టం జరుగుతుంటే నీకు చీమకుట్టినట్లైనాలేదు" అంటూ మండిపడ్డాడు శ్రీధర్.

"రేపే ఒకరిని ఎగ్జిక్యూటివ్‌గా నియమించుకోండి" అని సలహా ఇచ్చింది రవళి.

"ఇప్పటికిప్పుడు ఎక్కడ దొరుకుతాడు. దొరికినా నమ్మకస్తుడో కాదో ఎలా తెలుస్తుంది. రెగ్యులర్ కస్టమర్ల అడ్రసులు ఎవరు చూపిస్తారతనికి" అంటూ సందేహాల చిట్టా విప్పాడు శ్రీధర్.

"మరో మార్గమేదీ లేదా?" అంది రవళి తనలో తాను అనుకున్నట్లు నెమ్మదిగా.

"నువ్వే చెప్పు" అన్నాడు ఎద్దేవా చేసినట్లు శ్రీధర్.

కొద్దిసేపు ఆలోచించిన తర్వాత రవళి "మీకభ్యంతరం లేకపోతే నేను తిరిగి యాడ్స్ పట్టుకొస్తా" అంది.

ఏదో ఆలోచిస్తున్నవాడల్లా చివ్వున తలతిప్పి భార్య ముఖంలోకి చూసి "నువ్వా?! ఫీల్డ్‌కెళ్లి యాడ్స్ పట్టుకొస్తావా. తెలిసి మాట్లాడుతున్నావా? తెలీక మాట్లాడుతున్నావా?" అన్నాడు శ్రీధర్.

"తెలిసే మాట్లాడుతున్నాను. పదిసంవత్సరాలుగా మీతోపాటు బిజినెస్‌లో పాలుపంచుకుంటూనే ఉన్నాను. ఇటు ఇంటిపనులు చూసుకుంటూ అటు వచ్చే కస్టమర్ల ఫోన్లు రిసీవ్ చేసుకుంటున్నాను. కంప్యూటర్‌పై ఎన్నో యాడ్ డిజైన్లు చేశాను. కస్టమర్ల వివరాలు తెలుసు. మీ వ్యవహారాలు తెలుసు" అంది రవళి.

"మీ వ్యవహారాలు అంటే?" అడిగాడు శ్రీధర్.

"ఏముంది తొమ్మిదింటికి తాపీగా నిద్రగాలేవడం. ఉదయం పదకొండు గంటలకు ఇంటినుండి బయటకు వెళ్లడం. మళ్లీ రెండు గంటలకొచ్చి ఒకటో, రెండో యాడ్ ఆర్డర్లు నాముందు పడేయడం.

మధ్యాహ్నం హ్యాపీగా నిద్రపోవడం. సాయంత్రం ఓ గంట మళ్లీ ఫీల్డ్. ఆ తర్వాత 'డిజైన్ పూర్తిచేశావా? చేశావా?' – అంటూ నన్ను రాత్రి పదకొండుగంటల వరకు వేధించడం" అంది రవళి.

"ఇంట్లో కూర్చుని ఏదో రెండు యాడ్‌లు కంప్యూటర్‌పైన డిజైన్ చేసినంత మాత్రాన అన్నీ తెలుసననుకుంటున్నావు. యాడ్ పట్టుకురావడమంటే అక్కడ ఇవ్వగానే ఇక్కడికి తీసుకురావడం కాదు. మేనేజర్లతో కల్లబొల్లి కబుర్లు చెప్పాలి. సహనం కావాలి. అవసరమైతే కాళ్లావేళ్లాపడాలి. ఒక్కోసారి మాటలతో బురిడీ కొట్టించాలి. ఆర్డర్ తెచ్చుకోవాలి. ఆర్డర్ తెచ్చుకున్న తర్వాత డబ్బు ముట్టేవరకు వాడింటి చుట్టూ తిరగాలి. అదీగాక పత్రికా ప్రకటనల్లో నువ్వు డిజైన్ చేసినప్పుడు వచ్చిన తప్పులకు నేను సంజాయిషీ ఇచ్చుకోవాలి. ఆషామాషీ వ్యవహారం కాదు. ఎంత మెంటల్ టెన్షనో తెలుసా? ఒక్కమాటలో చెప్పాలంటే ఆడవాళ్లు ఏడవలేరు ఈ పని" అంటూ తేల్చిపారేశాడు శ్రీధర్.



క్షణంపాటు మౌనంగా ఉండిపోయింది రవళి. తర్వాత గట్టిగా నిర్ణయించుకున్నట్లు "నాకు ఒక్క ఛాన్స్ ఇవ్వండి. ఇంతకుమించి మరో మార్గం కూడా మనముందు లేదు" అంది ఆమె.

ఓ పిచ్చినవ్వు నవ్వి "సరే చూద్దాం" అన్నాడు శ్రీధర్.

ఆ క్షణం నుండే డ్యూటీలోకి దిగిపోయింది రవళి. కంప్యూటర్ ఆన్‌చేసి రెండు, మూడు నెలల్లో ఎక్కువ ఆర్డర్లిచ్చిన, క్రమం తప్పకుండా ఆర్డర్లు ఇస్తున్నవారి అడ్రసులు నోట్‌చేసుకుంది. ముఖ్యంగా యాడ్ డిజైన్ చేయడంలో దొర్లిన చిన్నచిన్న తప్పులను గుర్తించి ప్రత్యేకంగా వాటిని నోట్‌చేసుకుంది.

రెండోరోజు శ్రీధర్‌కు చేయాల్సిన భోజన ఏర్పాట్లు చేసింది. అతను వేసుకోవాల్సిన మందులు టేబిల్‌పైన అందుబాటులో పెట్టింది. హ్యాండ్‌బ్యాగ్ తీసుకుని అడ్రసులు నోట్‌చేసుకున్నవారిని కలిసేందుకు బయలుదేరింది.

"బెస్టాఫ్ లక్" అన్నాడు శ్రీధర్ మరోసారి ఎద్దేవ చేస్తూ.

"థ్యాంక్యూ వెరీమచ్" అంది రవళి నవ్వుతూ అతని ఎద్దేవను పట్టించుకోకుండా.

సిటీబస్సులెక్కడం, దిగడం తనకు కొత్తకాదు. అడ్రసులు వెదికిపట్టుకోవడంలో ఆమెకు పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. రెగ్యులర్‌గా యాడ్స్ ఇస్తున్న వాళ్లలో కొందరిని ఆరోజు ఆమె కలుసుకుంది. వాళ్లతో యాడ్‌కోసం వచ్చినట్టుగా కాకుండా అంతకుముందిచ్చిన యాడ్స్‌లో దొర్లిన తప్పులకు క్షమాపణ చెప్పడానికి వచ్చానని చెప్పింది. వారిచ్చిన చనువుమేరకు వారి వ్యక్తిగత వివరాలు అడిగితెలుసుకుంది. ప్రకటనదారుల కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరించింది. కలుసుకున్న ప్రతిఒక్కరితోనూ చివరిగా "మీరు మా ప్రధాన కస్టమర్. మీరిచ్చిన ప్రకటనలో అక్షరదోషాలకు కారణం నేనే. శ్రీధర్ ఈ విషయంలో నన్ను కోప్పడుతుంటాడు. మీరు మరోమారు అవకాశమిస్తే అటువంటి దోషాలేవీ రానివ్వను" అని చెప్పివచ్చింది. అంతకుముందిచ్చిన కొన్ని యాడ్ డిజైన్స్‌లో చెప్పుకోదగ్గ తప్పు లేకున్నా తనే వెతికిపట్టుకుని చూపి మరీ క్షమాపణ చెప్పింది. ఇలా రోజుకు పది, పదిహేనుమందిని మొదటివారం ఆమె కలిసివచ్చింది. ఆ ప్రభావం రెండోవారంలో బాగా చూపెట్టింది. యాడ్ ఆర్డర్లను ఫోన్ ద్వారా రిసీవ్ చేసుకుంటూ, డిజైన్ చేయడంలో శ్రీధర్ బిజీ అయ్యాడు. అతనికంతా ఆశ్చర్యంగా తోచింది.

నెల ఇట్టే తిరిగిపోయింది. రవళి నవ్వుతూ "ఎకౌంట్స్ చూడండి, నాకు శాలరీ ఫిక్స్‌చేయండి" అంటూ గోలపెట్టింది. ఎకౌంట్స్ చూసిన శ్రీధర్ షాక్ తిన్నాడు. ఈ నెల తన పెట్రోల్ ఖర్చులేకపోవడం వల్ల పన్నెండొందల రూపాయలదాకా ఆదా అయ్యింది. ఆర్డర్ల సంఖ్య దాదాపు రెట్టింపైంది. యాడ్ రెవెన్యూ మునుపటికన్నా బాగుంది. ఎకౌంట్ బుక్స్ మూసివేసి రవళిని దగ్గరకి తీసుకుని "సారీ పెళ్లామ్, ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ. తక్కువ అంచనా వేసినందుకు క్షమించు" అన్నాడు శ్రీధర్ చిన్నపిల్లాడిలా చెవులుపట్టుకుని.

"ఇందులో మీ తప్పేంలేదు. మీ జాతి లక్షణమది" అంది రవళి నవ్వుతూ.

*

మనమూ - మన నమ్మకాలు

బొట్టు

రుక్మిణి

వారు బొట్టు పెట్టడానికి ససేమిరా అంగీకరించరు. కారణం చాలా సింపుల్. అట్లా ఒక్కసారిగాని బొట్టుపెడితే ఆ రోగికి ఏదో ఒకలా స్వస్థత చేకూరితే సంతోషమే! అలా బొట్టు పెట్టినవాళ్లు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో గొప్ప నైపుణ్యం గల మంత్రగాళ్లుగా స్థిరీకరించబడతారు. బొట్టుపెట్టడానికి అంగీకరించకపోతే వారిమీద దాడులు తప్పవు. ఒక పల్లెలో (పేరవసరంలేదు) నేను పనిచేసినప్పటి అనుభవం.

"చంటిది రాత్రంతా గుక్కపట్టి ఒకటే ఏడుపు! ఎత్తుకుని తిప్పినా ఆపలేదత్తయ్యా. డాక్టరును పిలుచుకురమ్మని మీ అబ్బాయిని పంపాను" ఆందోళనగా అంది రమ. రమకి మధ్యనే పాప పుట్టింది. బొద్దుగా ఉంటుంది.

రమ అత్తగారికి అరవై ఏళ్లు దాటాయి. ఒక్కడే కొడుకు. ఉద్యోగం చేస్తున్నాడు. ఆమె అతని దగ్గరే ఉంటుంది. నియమనిష్టలు పాటిస్తుంది. పొద్దున్నే నీళ్ళు గుమ్మరించుకుని పూజలు చేసుకుంటుంది. వారంలో మూడురోజులు క్రమం తప్పక అమ్మవారి గుడికెళుతుంది.

"ఓసి నీ ఇల్లు బంగారం గానూ... దీనికి డాక్టరెందుకే? ఉండు" అంటూ చకచకా పూజ గదిలోకెళ్లి, ఇంత కుంకుమ తెచ్చి పాప పొట్టమీద రాసింది. ఏమో చదివింది.

ఇలాంటి సన్నివేశాలు చాలా ఇళ్లలో చూశాను. దానివల్ల ఎలాంటి ఫలితమూ ఉండదని తెల్సుకునేసరికి అది కాస్తా మిక్కుటమౌతుంది. గత్యంతరం లేక డాక్టర్ని ఆశ్రయిస్తారు. ఆయనగారు చడామడా తిట్టి వైద్యం చేస్తాడు. చదువుకున్న వాళ్లలోనూ ఇలాంటి బొట్టు సంప్రదాయాలు వెల్లివిరియడం ఒక వింత!

పల్లెటూళ్లలో ఇది కాస్తంత ఎక్కువే. ఈ మధ్య రైతులకు కరెంటు పగటిపూట గాకుండా రాత్రుళ్ళు ఇస్తోంది ప్రభుత్వం. అదీ రెండుమూడు విడతల్లో. ఆదరాబాదరాగా ఇంత తిని, తువాలు భుజం మీదేసుకుని పొలాలకెళుతున్నారు రైతులు. కొందరికి టార్చిలైట్లుంటాయి. లేనివాళ్లు కళ్లు చికిలిస్తూ జాగ్రత్తగా వెళ్లాలి. పొదల్లో విషపురుగులు ఉండడం సర్వసాధారణం! అంతేగాక మోటారు వైర్లుగాలికి ఊడిపోవడం, విద్యుత్ నేలద్వారా ప్రవహించడం సర్వసాధారణం!

విద్యుత్ దెబ్బకో, విషపురుగుల కాటుకో రైతులు బలవుతున్నారు. అందుకే చాలామంది రైతులు బయటికెళ్లేటప్పుడు వారి భార్యలు నుదుటిపైన బొట్టు పెడతారు. అది రక్షణగా ఉంటుందని వారి నమ్మకం. పూర్వకాలంలో యుద్ధరంగానికి పోయే వీరులకు వీరతిలకం దిద్దినట్లు!

చేతబడుల నమ్మకం ఇప్పటికీ పల్లెల్లో బాగా వేళ్ళూనుకుంది. ఈ చేతబడులు చేస్తే తమ 'పగవారు' ఏదో ఒక రోగంతో పోతారనే పిచ్చినమ్మకం జాస్తిగా ఉండిపోయింది. చిత్రమేమిటంటే ఈ చేతబడులు మహిళలే ఎక్కువగా చేస్తారనే అతి భయంకరమైన నమ్మకమూ ఒకటుంది. వరంగల్ జిల్లాలో చాలామంది అమాయకులను బహిరంగంగా సజీవదహనం చేసిన సంఘటన గుర్తుండే ఉంటుంది. ఇలాంటి 'కీలక' సమయాల్లో ఈ బొట్టు చాలా ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. అది ఎటులనిన... ఆ చేతబడి చేసినట్లు అనుమానం ఉన్న వ్యక్తిని పట్టుకోవాలి. వారి చేత్తో చేతబడికి గురైనట్లు భావించిన రోగికి బొట్టు పెట్టించాలి. వెంటనే ఆ రోగికి స్వస్థత చేకూరుతుందని నమ్మకం.

వారు బొట్టు పెట్టడానికి ససేమిరా అంగీకరించరు. కారణం చాలా సింపుల్. అట్లా ఒక్కసారిగాని బొట్టుపెడితే ఆ రోగికి ఏదో ఒకలా స్వస్థత చేకూరితే సంతోషమే! అలా బొట్టు పెట్టినవాళ్లు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో గొప్ప నైపుణ్యం గల మంత్రగాళ్లుగా స్థిరీకరించబడతారు. బొట్టుపెట్టడానికి అంగీకరించకపోతే వారిమీద దాడులు తప్పవు. ఒక పల్లెలో (పేరవసరంలేదు) నేను పనిచేసినప్పటి అనుభవం. ముదిరాజు కుటుంబానికి చెందిన ఒకమ్మాయి హఠాత్తుగా చనిపోయింది. అందరూ ఆశ్చర్యపడ్డారు. రోగం ఏమీలేదనే భావనవల్ల వాళ్లు దాన్ని చేతబడిగా అనుమానించారు. తర్వాత ఒక నెలకు అదే ఇంట్లో ఒక పసిపాపకు తీవ్రంగా జ్వరమొచ్చింది. అక్కడి పల్లెటూరి డాక్టరుకు చూపించారు. అయినా తగ్గలేదు. దాంతో అది చేతబడని అందరూ ఏకగ్రీవంగా డిసైడ్ చేసేశారు.

ఇంటి ఎదురుగా మేకలు కాసుకుని బతికే లింగయ్య మీద వారి దృష్టి పడింది. లింగయ్య డెబ్బై ఏళ్ల వృద్ధుడు. చిక్కిపోయి ఇవాళో రేపో అన్నట్లుంటాడు. లింగయ్య రోజూ స్నానం చేయడం, పూజచేసి పన్లోకి దిగడం వాడి కొంపముంచింది. పొద్దున్నే మేకలను తీసుకుని దగ్గర్లోని గుట్టల్లోకి తోలుకుపోయాడు. ఆ మధ్యాహ్నం పాప అన్న, మేనమామలు కలిసి అడివికెళ్లారు. లింగయ్యను నిలదీశారు. వాడు లబోదిబోమన్నాడు. తనకేం తెలియదని మొత్తుకున్నాడు.

"బొట్టు పెడుదువుగాని రారా!" అని తీవ్రంగా బాదారు. లింగయ్య ఒప్పుకోలేదు. వాళ్లు కొట్టిన దెబ్బలకు లింగయ్య స్పృహ కోల్పోయాడు. తోసిన తోపుకు తల బండరాయిని ఢీకొట్టడంతో ప్రాణం పోయింది. ఈ ఇద్దరిలో రాక్షసత్వం బుసలు కొట్టింది.

"చాతబడి చేయ్యనూ చేసిండు. బొట్టుపెట్టురా లం.. కొడకా... అంటే రాడు కానీ..!" అని ఓ కత్తితో లింగయ్య కుడిచేతి మోచేయి వరకూ నరికారు. తువాలులో దాన్ని చుట్టుకుని చీకటిపడే వేళకు ఇల్లు చేరుకున్నారు. ఆ నరికిన చేతి బొటనవేలును కుంకుమలో ముంచి పాపకు 'బొట్టు' పెట్టేశారు.

పాప విషజ్వరంతో మర్నాడు చనిపోయింది. లింగయ్య శవం నీళ్లలో దొరికింది. పోలీసులు ఆ ఇద్దరు మేధావులను రాణాకు తీసుకెళ్లి, తమ శైలిలో ఇద్దరికీ బొట్టుపెట్టేశారు. వాళ్లు చేసిన నేరాన్ని అంగీకరించారు. ప్రస్తుతం జైల్లో కటకటాలు లెక్కబెడుతున్నారు.

బొట్టు స్త్రీలకు చక్కటి అలంకారం. అంతేతప్ప అది వ్యాధులనూ, రుగ్మతలనూ, పిచ్చినీ నయం చేసే చిహ్నమో, ఔషధమో కాదు. *

సమీక్షణం

జీవితాన్ని అపహాస్యం చేసే కుసంస్కారం

'రీడింగ్ బిట్వీన్ ద లైన్స్'

జ్వాలాముఖి



ఈ ఇంగ్లీషు పలుకుబడికి అర్థం, రచనలో ఉండే రెండు పంక్తులమధ్య దాగి ఉన్న అంతరార్థాన్ని చదివితెలుసుకోగలగడం. 30 సంవత్సరాల క్రితం సుజాతారంగరాజన్ రాసిన చిరుతమిళ కథానిక 'ఇరుకదితం'. అంటే ఇద్దరి కథ అని అర్థం. దీన్ని ఇంగ్లీషులో నాటకీకరించి 'రీడింగ్ బిట్వీన్ దలైన్సు' పేర సుప్రసిద్ధ సినీనటి సుహాసిని(జూన్ 19-20 తేదీల్లో, హైదరాబాద్‌లో) ప్రదర్శించారు.

ఈ నాటకాన్ని మరింత ఆసక్తికరం చేయడానికి కూతురు 27 సంవత్సరాల రాధ, (కెమిస్ట్రీ ప్రొఫెసరు) తన తల్లి శాంతమ్మ (హైదరాబాదు) రాసిన రెండు సుదీర్ఘ ఉత్తరాలు చదువుతూ ప్రతి వాక్యంపై ప్రశంసాత్మకంగా, హాస్యస్ఫోరకంగా వ్యాఖ్యానించడం, సందర్భాల విశదీకరణకు, జ్ఞాపకాల ఆవిష్కరణకు 'వీడియో క్లిప్పింగులను' వాడుకోవడం, అవి సరిపోక గత జ్ఞాపకాల అనుబంధాలు పెనవేసుకున్నప్పుడు చక్కని తమిళపాటల్ని (ఇళయరాజా సంగీతం) నృత్యరూపకంగా చూపడం, అందుకు తగినట్లుగా తల్లిని ఆనాటిపాత్రగా ప్రవేశపెట్టడం సన్నివేశాలకు ప్రాణం పోశాయి. గతవర్తమానల్లో సాగే లేఖల పఠనం, చమత్కార వ్యాఖ్యానం, కదిలే సందర్భాల సంభాషణ - గతాన్ని వర్తమానం చేసే కళ ఇది. తల్లి శాంతమ్మ అనుభవసారం కూతురుకు గుణపాఠంగా రెండు లేఖల్లో నిక్షిప్తంకావడం హత్తుకునే అంశం. తల్లిశాంతమ్మ కూతురు రాధకు (అమెరికా నివాసి) జీవిత పాఠాలు చెప్పడం భర్తలద్వారా మోసపోయిన తల్లీకూతుళ్ల లేఖల్లో సంభాషించుకోవడం నాటకీయత. కూతురిని జాగ్రత్తగా ఉండమని తల్లి హితబోధచేయడం ఈ నాటక ప్రత్యేకత.

అయితే జీవనదుర్భర దృశ్యాల్లో ఎక్కడా 'ఆర్తి' కనిపించకపోవడం ఆ సన్నివేశం చమత్కారంగా ముందుకురావడం ఉత్తమ రచనాలక్ష్యం కాదు. 'ఔచిత్యం' నాటకానికి ఊపిరి, సంస్కారానికి ప్రాణం. జీవితగాయాలు జ్ఞాపకాలుగా తన్నుకుని వచ్చే సందర్భాల్లో 'దుఃఖాంశ'ను హాస్యాంశగా వ్యాఖ్యానించడం కుసంస్కారం. సంపన్న కుటుంబాల్లో తలెత్తే ఫ్యూడల్ ఇష్టాయిష్టాలు క్రమంగా పట్టుదలలుగా పరిణమించడం, దాంపత్యాలు భౌతికానందానికే పరిమితం కావడం, సంక్షోభం వచ్చినప్పుడు సహనం, సంస్కారం దెబ్బతినడం చేసేదిలేక హత్యగురించి నవ్వుకోవడం భావదారిద్ర్యానికి పరాకాష్ట.

హైదరాబాద్ నివాసి శాంతమ్మ ముద్దుల కూతురు రాధ (27 సం॥) అమెరికానివాసి ఈ ప్రవాస భారతీయురాలుకు ఆదాయం సమస్య లేదు. జల్సాల జీవితంలోకి భర్తగా వచ్చినవాడు సంతృప్తిని పెంచలేదు. చెడిన కాపురం తల్లికి దుఃఖం కలిగించింది. తల్లి బతుకు కూడా అందుకు భిన్నవేంకాదు. మరొకరు ప్రవేశించిన దాంపత్యంలో తల్లి కుయుక్తురాలైంది. గులాబ్‌జామున్‌లో విష ప్రయోగం 'రసాయనిక చర్య' (కెమిస్ట్రీ) అయింది. ఈ ప్రక్రియ హాస్యచమత్కారంగా సాగింది. వీడియో క్లిప్పింగ్‌లో చూపారు కూడా. హత్య అందునా, అనుకూలుడు కాని భర్త హత్య.. ఆపై సాంప్రదాయాన్ని వల్లించే తల్లి ఆ మార్గం సరైనదేనని కూతురుకు లేఖ రాయడం, దాన్ని చదివిన కూతురు ప్రవాసజీవితంలో మెచ్చుకోవడంలా ప్రవర్తించడం అనౌచిత్యం. భారతీయ మహిళ, అందునా దాక్షిణాత్య పూజాపునస్కారాల మహిళ.. కూతురి కాపురం బాగుపడ్డానిగ్గానూ అల్లుని సాగనంపడం వంటి చర్యను సూచించడం.. అదీ అనుభవసారంగా చెప్పడంలో 'ఔచిత్యం' లేదు. ఇంత జాణతనాన్ని ప్రదర్శించే మహిళ భర్తను అనుకూలం చేసుకునే తర్కం కనిపించదు. హత్యా సన్నివేశాలు, విష ప్రయోగాలు, హాస్య చమత్కారం కావడం పరమకిరాతకం. తల్లికుయుక్తులు, కూతురి చమత్కారాల మధ్య దక్షిణాది ఆహారపుటలవాట్లు, అమెరికా దుర్భర ఆహార విధానం, వైరుధ్యాలు, వీధులు, జ్ఞాపకాలు, వినోదాలు, పండు గలు... ఇలా సాగుతుంది.

శాంతమ్మ పొరుగింటి అబ్బాయి మహ్మదలీ బేగ్ కథకు సూత్రధారుడు - చాలా నిస్సారంగా కథ పూర్వా పరాల్ని చెబుతాడు. నిజానికి సన్నివేశాల్ని కళాత్మకంగా వ్యాఖ్యానించే అవకాశం ఉంది. సూత్రధారుని నిష్క్రమణ తర్వాత తల్లి రాసిన మొదటి ఉత్తరాన్ని కూతురు రాధ నాటకీయంగా, తాత్పర్య వ్యాఖ్యానాలతో చదవడం ప్రారంభిస్తుంది.

తల్లి హెచ్చరికలు, జాగ్రత్తలు, కుయుక్తులు లేఖనిండా ఆవహిస్తాయి. అవన్నీ కూతురు నాటకీయంగా చదువుతూ వ్యాఖ్యానిస్తుంది. రాధ కాపురం బాగుపడడానికి తాను నువ్వులనూనెతో పూజలుచేసి దీపాలు వెలిగించినట్లు చెబుతుంది. గతాన్ని నెమరువేస్తూ తాను చేసిన 'గులాబ్ జామున్' రసాయనిక ప్రక్రియనే ఆశ్రయించమంటుంది తల్లి. కాపుర వైఫల్యాల పునరావృత్తిని పేర్కొంటుంది. అల్లుడి పీడ వదిలించుకోమని ఏ తల్లీ కూతురుకు చెప్పదు. కాని ఈ నాటకంలో 'గులాబ్ జామున్ కెమిస్ట్రీగా చెబుతుంది. కూతురు వ్యాఖ్యానిస్తుంది. హాస్యావధానంగా చెడుతిరుగుళ్ల భర్తల్ని వదిలించుకునే మార్గం హత్య.

చెడిన కాపురాల విచ్చలవిడి వ్యాఖ్యానం ఈ నాటకం. హావభావ ప్రదర్శనలు, ఇంగ్లీషు ఉచ్చారణ, నాటకీయత, జ్ఞాపకాల దృశ్యీకరణలు, ఆటాపాటా, నాట్యాలు - ఈ నాటక విశేషాలు. నాటకాన్ని రక్తికట్టించే లేఖాపఠనం, వ్యాఖ్యానం చమత్కారం, సన్నివేశాల వీడియో క్లిప్పింగులు, జ్ఞాపకాలు, పాటలు కథనాన్ని అర్థవంతంచేశాయి.

సుహాసిని చురుకైన ఆత్మవిశ్వాసంతో, నాటకీయంగా లేఖల్ని చదవడం ద్వారా ఒక అనుభవాన్ని దృశ్యీకరించగలిగింది. నిజానికి నాటకం 'శవశృంగారం' నడయాడే వినోదాలుగా ముందుకు రావడం 'అనౌచిత్యం'. హత్య కూడా హాస్యం కావడం 'గులాబ్ జామున్ విష ప్రయోగం' (కెమిస్ట్రీ) చమత్కరింపబడడం దుర్మార్గ ఆలోచన. ప్రవాస జీవితంలో 'విడాకులు' సులభ పరిష్కారాలు - ప్రవాసభారతీయుల వివాహాల గురించి త్వరలో ఒక చట్టం కూడా రాబోతోంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో 'జీవితం' పునర్నిర్వచనాన్ని కోరుతున్న సందర్భంలో ఈ నాటకం జీవితాన్ని హాస్యాస్పదం చేసింది. జీవితం నవ్వులాటకాదు. జీవితం అపహాస్యంపాలు కారాదు. జీవితాన్ని పరిహాసంచేసి, సుదీర్ఘ చమత్కార స్వగతంగా వెళ్ళబుచ్చేవారు. జీవితానికి భారం అవుతారు. జీవితం నూరేళ్ల పంట. దాంపత్యం పంట పరమానందం. రెంటికీ చెడినవారు జీవితాన్ని వక్రీకరించుకుంటారు. ఏడ్వలేక అభిమానం అడ్డురాగా నవ్వుకుంటారు. నిజానికందులో వున్నది ఓటమి దయనీయ ఓటమి. అదే ఈ నాటకం. *

మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్ : 9849130141

హిప్నో కమలాకర్

నేను బి.ఎ. సెకండియర్ చదువుతున్నాను. నాకు సుపీరియారిటీ కాంప్లెక్స్, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, ఇగో - ఈ మూడింటికి పూర్తి వివరణ కావాలి. అలాగే వీటికి పరిష్కార మార్గం కూడా తెలుసుకోవాలని వుంది. దయచేసి తెలియజేయండి.

భావన, రావులపాలెం

జ॥ సుపీరియారిటీ కాంప్లెక్స్ అంటే ఒక వ్యక్తి తన సామర్థ్యాన్ని మించిన శక్తి తనకు కలదని భావించడం. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ అంటే ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించడం. ఒక పనిని చేయగల సామర్థ్యం తనకున్నప్పటికీ అది లేదేమోనని న్యూనత భావాలను కల్గి ఉండడం, ఇక ఇగో విషయానికి వస్తే ప్రముఖ సైకాలజిస్టు సిగ్మండ్ ఫ్రాయిడ్ నిర్వచించినట్లు ఇది మూర్తిమత్వంలో ఒక భాగం. ఇది ఇడ్‌కు సూపర్ ఇగోకు నడుమ మధ్యవర్తిగా వ్యవహరిస్తుంది. అంతరంగంలో ఒత్తిడిని కలుగచేసే మనోభావాలను ఇడ్‌లోకి వెళ్లే అవి జ్ఞప్తికి రాకుండా చూస్తుంది. అయితే వాడుక భాషలో గర్వం కలిగిన వ్యక్తిని ఉద్దేశించి మాట్లాడేటప్పుడు ఇగో పదాన్ని ఉపయోగించడం జరుగుతుంది. ఇవి ఏవీ మీరు భావిస్తున్నట్లుగా మానసిక రుగ్మతలు కావు. ఇవి కేవలం మానసిక స్వభావాలు మాత్రమే. అయితే ఈ స్వభావాలు మనుగడకు ఇబ్బంది కల్గిస్తాయి. ఇవి ప్రణాళిక బద్ధతను దెబ్బతీస్తాయి. విజయానికి అవరోధంగా నిలుస్తాయి కనుక వాస్తవిక దృక్పథాన్ని కలిగుండాలి. సహజత్వానికి దగ్గరగా ఉండడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చు. ఒకవేళ ఎవరికి వారే స్వయంగా వీటిని నివారించే క్రమంలో సత్ఫలితాలను సాధించలేకపోతుంటే అందుబాటులో ఉన్న సైకలాజికల్ కౌన్సిలర్‌ను సంప్రదించవచ్చు.

నేను ఇంటర్ ఫస్టియర్ చదువుకుంటున్నాను. నా వయసు 17 సంవత్సరాలు. పదవతరగతిలో 75 శాతం మార్కులతో పాసయ్యాను. అప్పట్లో ఏది చదివినా బాగా గుర్తుండేది. కానీ ఇంటర్‌లోకి వచ్చాక జ్ఞాపకశక్తి తగ్గింది. ఇంటర్‌లో మంచి మార్కులు రావాలంటే ఏంచెయ్యాలి?

జె. విజయ్, నిజామాబాద్

జ॥ పదో తరగతిలో సిలబస్‌కు, ఇంటర్ సిలబస్‌కు స్థాయి బేధం ఉంటుంది. దానికి తగిన విధంగా సమయం కేటాయించడం, వాటిని అవగాహన చేసుకోవడం, మరింత నైపుణ్యాన్ని పెంపొందింపచేసుకోవడం అవసరం. ఇంటర్‌కు రాగానే మీ సామాజిక స్థాయితోబాటు మానవ సంబంధాలు కూడా విస్తృతమౌతాయి. దీని మూలంగా అనేక ప్రభావాలు పడి వత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో చదువుకు మీరిచ్చే ప్రాధాన్యత కూడా హెచ్చుతగ్గులకు లోనవుతుంటుంది. ప్రస్తుత మీ పరిస్థితిని అవగాహన చేసుకోవడంద్వారా సమస్యకు పరిష్కారమార్గం దొరుకుతుంది. మీరు చదువుకు ఇచ్చే ప్రాధాన్యతను బట్టి దానిపట్ల ఆసక్తి, ఏకాగ్రత, అర్థం చేసుకోగల్గడం, జ్ఞాపకం ఉంచుకోవడం మొదలైన విషయాలు ఆధారపడి ఉంటాయి. కాబట్టి మీరు ఎంత ఎదిగినా చదువు తర్వాతే అన్నీను అని గుర్తించండి.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమస్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ **శ్రీ హిప్నోకమలాకర్** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

ఒరే తమ్ముడూ

తమ్ముడూ...
అకస్మాత్తుగా నీవు
ఆకాశదారిన ఎందుకు
వెళ్లావురా...?
భార్యాపిల్లల్ని
ఒంటరివాళ్లను చేసి
ఏ కార్యం సాధించ
అకారణంగా పోయావురా...!
అన్నలకు తమ్ములకు
మిత్రులకు
ఉన్నపళంగా టాటా
చెప్పావు కదరా!!
తమ్ముడూ...
నీది బలవన్మరణం!
ఒక్కోసారి చావు కూడా
సవాలక్ష ప్రశ్నలతో
వేధిస్తుందిరా!
తమ్ముడూ...
నీవు జీవన పోరాటంలో
వీరునిలా

నిలబడతావును
కున్నానురా...
ఇలా ఉత్తసమస్యల
ఆటుపోటులకే
అలలా
కుప్పకూలుతావనుకోలేదురా!
తల్లిని పల్లెని విడచి నగర
జనారణ్యంలో
తల్లడిల్లే
కుందేలువవుతావనుకోలేదురా
పులివై ఆకలిమీద మన
శత్రువుమీద
అలుపెరుగని పోరాటం
చేస్తావనుకున్నారా...
కానీ... తమ్ముడూ...
పిరికివాడివై నీవు
పురుగులమందుకు
బలవుతావనుకోలేదురా...!!!

మరికంటి



అవీ... ఇవీ

డ్యూటీ

రామయ్యగారికి ముగ్గురు కోడళ్ళున్నారు. వాళ్ళు ఏ పనైనా సరే కలిసిమెలిసి చేసుకుంటూ ఎంతో స్నేహంగా వుంటారు. ఈ పని నాది, ఈ పని నీది - అని ముందే వాటా వేసుకుంటారు.

ఆవేళ పెద్దకోడలొచ్చి మామగారికి విస్తరేసి, మంచినీళ్ళ గ్లాసు పెట్టింది.

ఇక రెండో కోడలు తన వంతు ప్రకారం అన్నీ వడ్డించింది.

చిన్నకోడలు కొంతసేపు చూసింది. మామగారు వస్తోన్న జాడెక్కడా కనిపించలేదు. 'ఈవేళ భోజనం చేయరు కాబోలు.. వాళ్ళిద్దరూ తమ పనులు సవ్యంగా చేశారు. మరి, తన డ్యూటీ సరిగ్గా చేయకపోతే ఎలా?' అనుకుని విస్తరెత్తేసి, చేతులు కడుక్కుంది.

- లేఖ



కొత్త పుస్తకాలు



జలఖడ్గం

సామాజిక వ్యవస్థ మానవుల మనస్తత్వాలను రూపొందించడంలో పునాదిగా ఉంటుంది. ఆ వ్యవస్థలో పుట్టిపెరిగి ఆలోచనా పరుడిగా మారిన మనిషి తను ఇబ్బందిగా, అసహజం గా భావించిన సామాజిక అసమంజసతను వివిధరూపాల్లో వ్యక్తీకరిస్తాడు. తద్వారా వ్యవస్థలో మార్పులకు కారణమవుతాడు. అయితే మార్పు వేగవంతం అవ్వడం మాత్రం సమకాలీన వ్యవస్థలో నిజాయితీగా మార్పును కాంక్షించే ప్రగతిశీల వేదికల శక్తిపై ఆధారపడి ఉంటుంది. ఈ దిశగా అవగాహనను అందిపుచ్చుకున్న కవులు, రచయితలు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారు. జలఖడ్గం కవితా సంపుటి రచయిత ఆ దిశగా ప్రయాణం ప్రారంభించాడన్పిస్తుంది. పుస్తకంలో కవితలన్నీ వ్యవస్థ లోపాలను బహిర్గతం చేసేవే.

వ్యవస్థ లోపాల పట్ల, ప్రకృతి వైపరీత్యాల పట్ల ఒకే తీవ్రతతో కవిత్వాన్ని విన్పిస్తాడు. పుస్తక శీర్షిక పేరున్న జలఖడ్గం కవితలో సునామీ బీభత్సాన్ని కవిత్వీకరిస్తూ 'ఘోషయాత్ర గమ్యం చెదరి/ బ్రతుకు నావ బ్రద్దలైంది/ తుపానుకు, గాలికెరటానికి అతీతమైన అలల సద్దు/ విరుచుకుపడ్డ పిశాచర జలఖడ్గం/ గూళ్ళకు గూళ్ళనే చిదిమేసి... ఊళ్ళకు ఊళ్ళనే మింగేసి...(జలఖడ్గం)' అంటాడు. ప్రకృతి వైపరీత్యానికే సంబంధించిన మరో కవితలో ప్రకృతిలోని పంచభూతాలను దోషిగా నిలబెడ్తూ 'బుడి బుడి అడుగుల మెరిసే నక్షత్రాలు/ నేడు మరకల ఆకాశాన దివిటీలై కాలుతున్నాయి/ ముమ్మాటికీ భోరుకలిలోని దుష్టకోణమిది.../ పంచభూతాల కుంభకోణమిది'. ప్రజల జీవితాలను అతలాకుతలం చేసే పంచభూతాల ప్రకృతి సమన్వయాన్ని కుంభకోణంగా అనడం కవి ఆలోచనల్లోని భిన్నత్వాన్ని ప్రదర్శిస్తుంది. ఈ పంక్తుల్లో 'నక్షత్రాలు మరకల ఆకాశాన దివిటీలై వెలుగుతున్నాయి' అన్న వాక్యం చదివిన పాఠకుడు నక్షత్రాలన్నీ ఆకాశంలో దివిటీలుగా మారి వెలుగుతున్నట్లుగా ఊహించుకుంటాడు. ఇలాంటి ఉపమానాలు కవి చక్కగా ఉపయోగించాడు. నిజానికి ప్రకృతిలో భాగమైన అనేక విషయాల గురించి భిన్నంగా కవిత్వీకరించడం ఈ సంపుటిలో మనకు కన్పిస్తుంది. నదుల్లాంటి ప్రకృతి విషయాలు కవికి వస్తువులు అయ్యాయి. గాలికి ఎగిరొచ్చిన విత్తనం మొక్కై, చెట్టుగా మారే పరిణామాన్ని ఒక కవితలో ఇమిడ్చిన తీరు ఈ కవి ప్రతిభను పట్టిస్తుంది. 'ధరణి మొలకను దత్తత తీసుకుందో ఏమో/ పంచభూతాల పెంపకంలో/ మొలక మ్రానై దృఢపడింది/ చిగురించిన చైత్రంలా వచ్చే/ పరువాల పొంగులను దాచుకోలేకే/ మొక్క సిగ్గుతో మొగ్గలేస్తోంది/ ప్రకృతి పరాన్వేషణ చేస్తూంటే/ ఏకంగా తుమ్మెదలు స్వయంవరానికి వచ్చేశాయి'. సామాజిక అంశాలతోపాటు ప్రకృతి విషయాలపట్ల కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వడం కవిలో కన్పిస్తుంది.

ప్రధానమైన మానవసంబంధాల విషయంలో కవి స్పందించిన తీరు చాలా సహజంగా ఉంది. జనారణ్యంలో విసిగివేసారిపోయి తిరిగి మనుషుల మధ్య మమతలు చిగురించిన స్థితిని చెప్తూ 'అలసిన మనసుతో... భారమైన భావాలతో/ శిథిలమైన వ్యక్తిత్వంతో శిలనై/ జనారణ్యానికి దూరమైనప్పుడు/ మమత చూపిన మనోహర ప్రకృతి/ అల్పాయుష్షులోనూ అలరించే పరిమళంలా/ ఆనంద మకరందాల ఆలంబనతో/ రాగరంజితమైన హృదయంతో/ హాయి తానైన నవ్వుతో.../ సహజీవనం చేయమని ఉద్బోధించింది' అంటాడు. ఈ కవితలో 'అల్పాయుష్షులోనూ అలరించే పరిమళంలా' అనడంలో కొద్దిపాటి సమయంలోనే పరిమళం మనసుకు ఆహ్లాదం కల్గించడం పాఠకుడికి గుర్తుచేస్తూ అదేవిధంగా మానవారణ్యంలో ఏ కొద్దిపాటి మమతలైనా జీవితానుబంధాల్ని పెనవేసుకునేలా చేస్తాయన్న భావాన్ని సులువుగా వ్యక్తంచేస్తాడు. స్త్రీ పురుష సహజీవనానికి సంబంధించి రాసిన మరో కవితలో 'నువ్వెవరివో... నేనెవరినో... అది గతం/ నీకు నేను... నాకు నువ్వు ఇది వర్తమానం/ ఇద్దరి మమేకం... వలపు సాంద్రత/ ఇది పచ్చికాదు... పచ్చదనాల పందిరి/ ఆ పచ్చి పరిమళించాలి... ఆయా పచ్చదనాలు పెనవేయాలి' అనడంలో వారిమధ్య వలపుతో ప్రారంభమైన సహచర్యం పచ్చని అనుబంధంగా పరిమళించాలి అని కవి కవితాత్మకంగా చెప్తున్నాడు. కవితానిర్మాణం పట్ల కవి పట్టు ఈ సంపుటిలోని చాలా కవితల్లో కనపడ్తుంది. ఈ సంపుటిలోని 33 కవితలూ కూడా చదవదగినవే. ఆయా సమస్యలను కవిత్వకరించిన తీరును ఆస్వాదించవలసిందే.

'జీవన మకరందం' మరో మంచి కవిత. జీవితాల్లోకి చొచ్చుకువస్తున్న సెల్‌ఫోన్ల, ఇంటర్నెట్ ఛాటింగ్‌ల సాంకేతిక ప్రగతి మానవ సంబంధాల్లో తెస్తున్న మార్పుల్ని ఈ కవిత చక్కగా ప్రతిఫలించింది. తల్లినుండి మూడురోజుల తర్వాత వచ్చిన ఉత్తరముందు విదేశాల్లో ఉన్న బాల్యమిత్రులు ఇంటర్నెట్‌లోనూ, సెల్‌ఫోన్‌లోనూ ఛాటింగ్ చేయడం విలాసంగా కనపడడాన్ని కవిత్వీకరించిన తీరు ప్రశంసనీయంగా ఉంది. 'పోస్టుబాక్స్ కడుపులో పడి ఎలాగో బయటకొచ్చి/ మూడు గట్టి దెబ్బలు తిని నాలుగోరోజు/ పాచిపట్టిన వార్తతో ప్రత్యక్షమయింది/ తలతిప్పి ఇంటర్‌నెట్ మీట నొక్కాను/ తటాలున తలుపులు తెరుచుకుని అక్షరాలు రాలిపడ్డాయి/ జేబులోని సెల్‌ఫోన్ వైబ్రేషన్స్‌తో చర్మాన్ని అదరగొట్టేస్తోంది/ ఒకేసారి రెంటికీ సమాధాన మిచ్చాను/ చెట్లెంబట, పుట్లెంబట నాతో తిరిగిన నాటి మిత్రులు వాళ్ళు/ నేడు వేరు వేరు దేశస్థులై ఛాటింగ్ చేస్తున్నారు'.

'సమకాలీనంగా చూస్తే, ప్రజలకు కవిత్వం అర్థం కావాలనే దృక్పథమూ, ప్రజాసంఘర్షణలు ప్రతిబింబించి తీరాలనే నిర్ణయమూ బహుళవ్యాప్తమయింది. దీనికి ముఖ్యకారణం గ్లోబలైజేషన్ తీవ్రతరమౌతూ రావడమే. గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఈ దేశంలోని ప్రతివారికీ 'అస్తిత్వ' సమస్య ప్రతిరంగంలోనూ ఎదురౌతుంది. 'పరాయీకరణ' బీభత్సమైన భవిష్యత్తుని కళ్ళముందు నిలుపుతోంది. అందుకే కవులు ఇప్పుడనుభవించే సమస్యల్నిగూర్చి రాయడానికే ప్రయత్నిస్తున్నారు. ఇంతకుముందు ఇతరత్రా ప్రయోగాత్మకంగా రాసినవారు కూడా, సామాజిక చైతన్యంతో కొన్ని కవితలు రాస్తున్నారు. భాష, శిల్పాలను అయోమయం చెయ్యడం ఎవరికీ గొప్పగా అనిపించదు' అని ఈ సంపుటికి రాసిన ముందుమాటలో ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహనరావు అంటారు. ఈ మాటలు ఈ కవికి వందశాతం వర్తిస్తుంది.

కథకుడు కూడా అయిన ఈ కవి సాహిత్యరంగంలో మరింత రాణించడానికి అవకాశాలు పుష్కలంగా కనపడ్తున్నాయి. జలఖడ్గం కవితా విన్యాసాలను అందరూ చవిచూడాల్సిందే.

(జలఖడ్గం కవితా సంపుటి,
రచయిత: వడలి రాధాకృష్ణ,
పేజీలు: 70 వెల:
రూ. 40/-, ప్రతులకు: విశాలాంధ్ర, నవోదయ)

- వీరప్రసాద్



భాష

ప్రతులకు : ప్రధాన కార్యదర్శి, తెలుగు భాషాశాస్త్రజ్ఞుల వేదిక, కేరాఫ్ సెంటర్ ఫర్ అప్లయిడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ హైదరాబాద్ యూనివర్శిటీ, హైదరాబాద్ - 500 046



ఢమరుక్స్

వ్యంగ్య సెట్కులు

ఏటూరి నాగేంద్రరావు

వెల : 25/-, పేజీలు : 34

ప్రతులకు :
నెరసం ప్రధాన కార్యదర్శి,
25-1-949, నేతాజినగర్, 5వ వీధి,
ఏ.కె. నగర్, నెల్లూరు - 524 004



కోకోనట్ బర్ఫీ

కావాల్సిన పదార్థాలు

కొబ్బరితురుము	- రెండుకప్పులు
పంచదార	- ఒక కప్పు
పాలు	-ఒక కప్పు
నెయ్యి	- ఒక కప్పు
ఎసెన్స్	- ఒక స్పూన్

తయారు చేసే పద్ధతి

ఒక మందపాటి గిన్నెను స్టౌమీదుంచి ఎసెన్స్ తప్ప పైన చెప్పినవన్నీ వేసి సన్నటి సెగమీద అడుగంటకుండా కలుపుతూ ఉడికించాలి. దగ్గరపడుతుండగా ఎసెన్స్ వేసి దించి నెయ్యి రాసిన ప్లేట్‌లో పోయాలి. సమంగా సర్ది చల్లారిన తరువాత ముక్కలుగా కోసుకోవాలి.

రుచి

మసాలా గారెలు

కావాల్సిన పదార్థాలు

శనగపిండి	-	రెండు కప్పులు
నెయ్యి	-	అరకప్పు
ఉల్లి తరుగు	-	ఒక కప్పు
అల్లంవెల్లుల్లి ముద్ద	-	ఒక స్పూన్
పచ్చిమిర్చి తరుగు	-	పావుకప్పు
జీలకర్ర	-	ఒక స్పూన్
పసుపు	-	చిటికెడు
ఉప్పు	-	తగినంత
కొత్తిమీర తరుగు	-	అరకప్పు
నూనె	-	తగినంత

తయారు చేసే పద్ధతి

ఓ బేసిన్‌లోకి శనగపిండి తీసుకొని దానిలో నెయ్యి వేసి తర్వాత నూనె తప్ప పైన చెప్పినవన్నీ వేసి నీళ్ళుపోసి గట్టిగా ముద్దగా కలుపుకోవాలి. దీన్ని చిన్నచిన్న ముద్దలుగా తీసుకుని పాలిథీన్ కవరుపై నూనె రాసి గారెలుగా చేసి నూనెలో వేసి ఎర్రగా వేయించి తీయాలి.



గెలుపు

పృథ్వీ

శివానందశెట్టి పెద్ద వ్యాపారవేత్త. అతనికి రామానందశెట్టి, కృష్ణానందశెట్టి అనే ఇద్దరు కొడుకులున్నారు. ధనరాశులు, కోట్లాది రూపాయల వ్యాపార లావాదేవీలు, భూములు, బంగారం, వెండి వంటి అపార సంపదతో శివానందశెట్టి కలియుగ కుబేరునిగా పేరొందాడు. స్వయంకృషితో పైకి వచ్చిన శివానందశెట్టికి ప్రజల్లో మంచి పలుకుబడి ఉండేది.

శివానందశెట్టికి వయసు మీదపడింది. దీంతో ఆస్తిపాస్తులను కొడుకులకు అప్పగించి, విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. అయితే తన వ్యాపార సామ్రాజ్యాన్ని ముక్కలు చేయడం అతనికిష్టం లేదు. అందుకని కొడుకులిద్దరిలో ఒకణ్ణి ఇంటి పెద్దగా చేసి, అతని ఇష్టానుసారం మిగతా వాళ్లంతా నడుచుకోవాలనుకున్నాడు. అలా చేస్తే తన వ్యాపారాలతోపాటు ధనరాశులు, ఆస్తిపాస్తులు అవిచ్ఛిన్నంగా వుంటాయని భావించాడు. అయితే ఇద్దరు కుమారుల్లో ఎవరిని కుటుంబ యజమానిని చెయ్యాలన్న విషయంపై అతను ఒక నిర్ణయానికి రాలేకపోయాడు. అందుకని తన భార్య లక్ష్మీరాజ్యాన్ని సలహా అడిగాడు.

దానికామె, "ముందు నీతినిజాయితీలతో వ్యాపారం చేసే వారెవరో తెలుసుకోండి. వచ్చిన లాభాల్లో ఎక్కువ భాగం ప్రజాసంక్షేమం కోసం ఎవరు ఖర్చుచేస్తారో గమనించండి. వారికే ఆస్తిపాస్తుల నిర్వహణ బాధ్యత అప్పగిస్తే బావుంటుంది. ఎవరు మంచి వ్యాపారో తెలుసుకోవడానికి ఇద్దరికీ చెరో కోటి రూపాయలు ఇవ్వండి. సంవత్సరం గడువుపెట్టండి. ఈలోగా ఎవరైతే ఎక్కువ పేరుప్రఖ్యాతులు సంపాదిస్తారో వారికే ఇంటి యాజమాన్యం అప్పగించండి" అంటూ సలహా ఇచ్చింది.

భార్య సలహా శివానందశెట్టికి కూడా నచ్చింది. వెంటనే ఆచరణలో పెట్టాడు. కొడుకులిద్దరికీ చెరో కోటి రూపాయలు ఇచ్చి, వారిద్దరి నుండీ తాను ఏమి ఆశిస్తోందీ చెప్పాడు. ప్రజా సంక్షేమాన్ని మరువకుండా నీతినియమాలతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసిన వారినే తన ఆస్తికి యజమానిని చేస్తానన్నాడు. కొడుకులిద్దరూ బుద్ధిగా తలూపి, తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. వాళ్లేం చేస్తోందీ గమనించమని తన స్నేహితుడు సత్యానందశెట్టికి పురమాయించాడు శివానందశెట్టి.

కృష్ణానందశెట్టి స్నేహితులతో కలిసి దేశం మీద పడ్డాడు. వారి సలహాతో నకిలీ సరుకులు, వస్తువులు కొన్నాడు. తండ్రికున్న పలుకుబడిని ఉపయోగించి వాటిని ఎక్కువ ధరకు అమ్మాడు. నకిలీ వస్తువుల అమ్మకం, దొంగనోట్ల వ్యాపారం ద్వారా కొన్నాళ్లలోనే అదనంగా కోటి రూపాయలు సంపాదించాడు. తండ్రికిచ్చిన మాట కోసం డమ్మీ స్వచ్ఛంద సంస్థలకు ధన సహాయం చేస్తున్నట్లు నటించాడు. ఆ సంస్థ సభ్యులతో కలిసి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఇలా మరో కోటి సంపాదించాడు.

ఇంకోవైపు రామానందశెట్టి తన మిత్రులతో కలిసి, 'ఏం చేస్తే బావుంటుంది?' అని ఆలోచించాడు. దేశవ్యాప్తంగా వున్న నిరుద్యోగులకు ఉపాధి కల్పన పేరిట ప్రకటనలిచ్చి, తన డబ్బుతో వారికి నాణ్యమైన వస్తువులు, సరుకులు కొనిచ్చాడు. వాటిని దేశమంతా తిరిగి కొద్దిపాటి లాభాలకు అమ్మమని చెప్పాడు. వచ్చే లాభాల్లో సగం వాటా నిరుద్యోగులకే చెందేటట్లు చేశాడు. అతితక్కువ లాభాలతోనైనా విస్తృతంగా వ్యాపారం చేస్తే అధిక లాభాలు వస్తాయన్న అతని వ్యాపార సూత్రం బాగా పనిచేసింది. పెట్టిన పెట్టుబడికి అదనంగా కోటి రూపాయల లాభమొచ్చింది. ఎంతోమందికి ఉపాధి దొరికింది. పేద పిల్లల చదువు కోసం రామానందశెట్టి లక్షలాది రూపాయలు వెచ్చించాడు.

ఇలా ఏడాది గడిచింది. మిత్రుడి ద్వారా ఈ వివరాలన్నీ తెలుసుకున్నాడు శివానందశెట్టి. అక్రమ వ్యాపారం ద్వారా కోటికి రెండు కోట్లు సంపాదించిన కృష్ణానందశెట్టి కంటే నీతినిజాయితీలతో వ్యాపారం చేసి మరో కోటి మాత్రమే సంపాదించిన రామానందశెట్టి మంచి వ్యాపారవేత్త అని నిర్ణయించుకున్నాడు. తను పెట్టిన పోటీలో అతనే గెలిచినట్టుగా భావించాడు. అతనికే తన ఆస్తి బాధ్యత అప్పగించాడు. చెడుమార్గంలో నడుస్తున్న కృష్ణానందశెట్టిని మందలించాడు.